Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 18.08.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 11 పేజీలు : 12, వెల : ₹ 5


కేర్
డా|| ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు
• రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత
• రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



రాష్ట్రంలో తెలుగుదేశం నాయకులకు ఇంత కాలం ఒక ఆశ ఉండేది. అక్రమాస్తుల కేసుల్లో వైకాపా అధినేత జగన్ జైలుకుపోతాడని, రాష్ట్ర రాజకీయాలలో ఇక తమకు తిరుగుండదని భావిస్తూ వచ్చారు. కాని, ఇప్పుడు వారి ఆశలకు నెమ్మదిగా తెరపడబోతోందని తెలుస్తోంది.

### ఒక్కొక్కటిగా వీగుతున్న కేసులు...

# వీడుతున్న సంకెళ్ళు

- బంధ విముక్తుడవుతున్న జగన్
- కేసులన్నీ కొట్టేస్తే 'దేశం'కు గండమే!

11లో

### ఉషాపతి అను నేను...

# ఉపరాష్ట్రపతిగా...



- అట్టహాసంగా ప్రమాణస్వీకారం
- తెలుగు జాతికిది గర్వకారణం

12లో



# శీలపరీక్షకు సిద్ధమైన శ్రీధర్

## ► శాసనసభ్యుడంటే... కొత్త అర్ధం చెప్పిన కోటంరెడ్డి

**జిల్లా రాజకీయాలలోనే కాదు, బహుశా దేశ రాజకీయాలలోనే ఇదో సంచలనం. శాసనసభ్యుల జీతాలు పెంచడాన్ని సాక్షాత్తూ అసెంబ్లీలోనే వ్యతిరేకించి కొత్త వొరవడికి శ్రీకారం చుట్టిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి... ఇప్పుడు తనపై వచ్చిన ఆరోపణలను నిగ్గు తేల్చాలంటూ బహిరంగంగా ప్రజలమధ్య కొచ్చి ఏకంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్నే నేరుగా కలసి సవాల్ విసరడం అతిపెద్ద చర్చనీయాంశంగా మారింది.**

నెల్లూరురూరల్ శాసనసభ్యుడిగా తాను గెలిచిన నాటి నుండి ప్రజల వాడిగా నిరంతరం ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రజల నాడిగా తనదైన పంధాలో తన భవిష్యత్ ప్రగతికి బాటలు వేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. ప్రజాసేవకు అధికారపార్టీయే అవసరం లేదని, సమస్య పరిష్కరించడానికి చిత్తశుద్ధి వుంటే ప్రతి పక్షంలో వున్నా పరవాలేదని రుజువుచేస్తూ ప్రజాభిమానాన్ని పొందుతున్న ఎమ్మెల్యేలలో మొదటి స్థానంలో వుంటాడు శ్రీధర్.

ఇటీవల జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం సంచలనమైన విషయం అందరికీ తెలిసిందే. బెట్టింగ్ బాబుల భరతం పడతానని చెప్పి జిల్లాకి క్రొత్తగా వచ్చిన ఎస్.పి పి. హెచ్.డి.రామకృష్ణ కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా తన పనితనాన్ని కూడా చూపాడు. ఆ పార్టీ ఈ పార్టీ అన్న తేడా లేకుండా అన్ని పార్టీల వారినీ పట్టి లోపలేశాడు. ఈ క్రమంలోనే శ్రీధర్‌రెడ్డి ముఖ్య అనుచరుడిని సైతం పోలీసులు అరెస్టు చేసారని, అనంతరం జరిగిన విచారణలో ఓ వైసిపి ఎమ్మెల్యేకి 40లక్షలు ముట్టజెప్పినట్లుగా శ్రీధర్ ముఖ్య అనుచరుడు వెల్లడించాడని ఓ ప్రముఖ దిన పత్రిక ప్రత్యేకశీర్షికలో వార్తను ప్రచురించింది. ఇక్కడే శ్రీధర్‌కి మండింది. గాలి వార్తలు, గాసిప్ వార్తలు ప్రచురించడం సబబు కాదంటూ (మిగతా 11వ పేజీలో)




### అందరి నోటా...

# నంద్యాల మాటే!

**టెన్షన్... టెన్షన్... పార్టీలలో టెన్షన్... అభ్యర్థులలో టెన్షన్... నాయకులలో టెన్షన్... అన్నింటికి మించి రాష్ట్ర ప్రజలలోనూ టెన్షనే! అక్కడ ఎవరు గెలుస్తారని? నంద్యాల ఉపఎన్నికల తేదీ దగ్గరపడేకొద్దీ రాష్ట్ర రాజకీయాలలో తీవ్ర ఉత్కంఠత నెలకొంటోంది.**

నంద్యాల... ఇది ఒక అసెంబ్లీ నియోజకవర్గం మాత్రమే! కాని, రాష్ట్ర రాజకీయ భవిష్యత్తే కాదు, రెండు ప్రధాన పార్టీల భవిష్యత్ కూడా ఈ ఉపఎన్నిక మీద ఆధారపడి వుండడంతో రాష్ట్ర ప్రజలే కాదు, ఢిల్లీలోని పార్టీలు కూడా నంద్యాల వైపే చూస్తున్నాయి. ఈనెల 23వతేదీన ఎలక్షన్... గట్టిగా అయిదారు రోజులు.. ప్రచారానికి అంత సమయం కూడా లేదు. ప్రధాన పోటీ తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీల మధ్యేనని వేరే చెప్పనక్కరలేదు. ఇక్కడ ఇరు పార్టీల ప్రచారం తారాస్థాయికి చేరింది. తెలుగు దేశం అధికార బలాన్ని ఉపయోగించుకుంటోంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని బాగానే వాడేస్తోంది. మంత్రులను వార్డు కౌన్సిలర్ల మాదిరిగా తిప్పుతోంది. సందు గొందుల్లో ఎమ్మెల్యేలను తిప్పుతోంది. ఓట్ల కోసం ఎన్ని రకాల ప్రయోగాలు చేయాలో అన్ని ప్రయోగాలు చేస్తూనేవున్నారు. తెలుగు దేశానికి మద్దతుగా పవన్ కళ్యాణ్‌ను కూడా ప్రచారానికి తీసుకురావాలనుకున్నారు గాని, అది నెరవేరలేదు. ఇక టిడిపి బ్రాండ్ అంబాసిడర్ యువరత్న బాలకృష్ణ నంద్యాల ప్రచారంలోకి దిగి కేడర్‌లో ఉత్సాహం తెచ్చాడు. రాష్ట్ర రాజకీయాల్లో అన్ని వర్గాల, అన్ని వయస్సుల ప్రజలలోనూ క్రేజ్‌వున్న (మిగతా 11వ పేజీలో)

# విషజ్వరాలతో నగరం విలవిల!

## ● వ్యాధుల బాధలతో జనం... పట్టించుకోని అధికారగణం...

*నెల్లూరు నగరంలో మున్నెన్నడూ లేనంతగా విషజ్వరాలు జనాన్ని గడగడ వణికిస్తున్నాయి. నగరమంతా ఎక్కడ చూసినా మురుగు గుంతలతో, పారిశుద్ధ్యం పరమ అద్వాన్నంగా ఉండడంతో దోమలు పెరిగిపోయి ప్రజలు నానా రకాల వ్యాధులకు గురవుతున్నారు. అయినా, అధికారగణం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో జ్వరపీడితులతో ఆసుపత్రులు కిటకిట లాడుతున్నాయి. అటు కార్పొరేషన్ కానీ, వైద్యఆరోగ్యశాఖ కానీ ఈ విషజ్వరాలను నివారించడానికి ముందస్తు చర్యలేమీ తీసుకోకపోవడంతో ఎప్పటికప్పుడు ప్రతి సీజన్‌లోనూ సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు మరింతగా ప్రబలిపోతున్నాయి.*



తొక్కిడితో బురదగా మారి, అదే ఎండకు ఎండి.. చివరికి మట్టిగా మారి..

ఇటీవల నగరంలో భూగర్భ డ్రైనేజీ కోసమని ఎడాపెడా తవ్వేస్తున్న గుంతలతో రోడ్లన్నీ మురుగ్గుంటలుగా..అవే దోమల గుంతలుగా మారిపోయాయి. వీధుల్లో మురుగునీటి ప్రవాహాలు వెల్లువెత్తుతున్నాయి. 'ఏ వీధి చూసినా ఏమున్నది గర్వకారణం.. ప్రతివీధి సమస్తం మురుగు ప్రవాహం'..అన్నట్లుగా అంతా దుర్గంధమే. చిన్న వాన కురిసినా చాలు, ఇక నెల్లూరు రోడ్ల మీద నడవాలంటే సర్కస్ చేయాల్సివస్తోంది. ఏ వీధి చూసినా మురుగుదిబ్బలు.. చెత్తకుప్పలతో నిండిపోవడంతో నగరమే ఒక మురికికూపంగా ఉంది. అధికారులు ఎప్పటికప్పుడు ఈ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని చెప్తున్నా, ఆచరణలో నానాటికీ దుర్గంధం పెరిగి పోతుండడమే తప్ప పారిశుద్ధ్య పరిస్థితి బాగుపడిందే లేదు. అంతేకాక, సైడుకాలువల కోసం తవ్విన గుంతల్ని పూడ్చే పనులు నామమాత్రంగానే ఉండడంతో నగరప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఏ వీధి చూసినా ఇదే వేదన. బాగున్న రోడ్లన్నీ గుంతలమయం చేశారని, రేపో మాపో వచ్చి బాగుచేస్తారులే అనుకుంటే రోజులు గడిచినా ఆ గుంతలు పూడ్చేవారే కరువయ్యారని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. అతుకులు గతుకులుగా, గుంతలు మిట్టలుగా తయారైన రోడ్లను చూసి ఈ నగరవీధులకు ఎంత దుస్థితి పట్టిందో కదా అని వాపోతున్నారు. నగరంలో దోమలు ఎంతగా ప్రబలిపోయి వీరవిహారం చేస్తున్నా దోమలను నివారించే ఫాగింగ్ యంత్రాలు మాత్రం కనిపించడం లేదు. ఉన్నతాధికారులు ఎప్పుడో ఒకసారి కఠినంగా ఆదేశించిన రోజున మాత్రం ఆ సిబ్బంది అలా వచ్చి ఇలా వెళ్ళిపోతారే తప్ప నగరంలో పారిశుద్ధ్యాన్ని క్రమబద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవడం లేదు. నగరంలోని ట్రంకు రోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, పెద్దబజారు, చిన్నబజారు, మూలాపేట, రంగ



నాయకులపేట, బాలాజీనగర్, దర్గామిట్ట, వేదాయపాళెం ఇలా ఏ ప్రధాన ప్రాంతంలోని వీధుల్లోకెళ్ళినా అపారిశుద్ధ్యమే. చివరికి కలెక్టర్ కార్యాలయం చుట్టుపక్కల ఉన్న రోడ్లు కూడా పరమ అధ్వాన్నంగా చెత్తకుప్పల మయంగా దర్శనమిస్తున్నాయి. వానొస్తే నీరంతా ఆ గుంతల్లోనే నిల్వ ఉండడంతో, అవి మురుగునీటి గుంటలుగా మారుతుంటాయి. ఒక్కోసారి ఆ ప్రాంతాల్లో మంచినీటి పైపులు పగిలిపోయి ఉంటే ఆ మురుగంతా ఆ పైపుల్లోకి వచ్చేస్తుంటుంది. రోడ్డు మధ్యలోనే ఉన్న ఆ గుంతలు అటు వాహనాల రాకపోకలకు, ఇటు పాదచారులకు ఎంతో ఇబ్బందిగా ఉన్నా నిత్యం అనేకమంది అధికారులు కూడా ఆ దారుల్లోనే వాహనాల్లో వెళ్తున్నా, చూసీ చూడనట్లు వెళ్తుంటారే తప్ప ప్రజల బాధలు అస్సలు పట్టించుకోవడం లేదని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతమంది ఎన్నివిధాలుగా చెప్తున్నా గతుకుల మయంగా ఉన్న రోడ్లను బాగుచేసిందీ లేదు.. ఆ గుంతలను సక్రమంగా పూడ్చిందీ లేదు. ఇదీ దుస్థితి. ఇక ఆ గుంతల్లోని మురుగంతా రోజుల తరబడి వాహనాల దానిపాటికదే గాలిలో... ధూళిలో కలసిపోవాల్సిందే తప్ప ఇక మరో మార్గాంతరం ఉండడం లేదు. తద్వారా ఏర్పడుతున్న ఆ దుర్గంధపూరిత వాతావరణానికి, ఆ కాలుష్యానికి సమీప ప్రాంతాల్లోని ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, రోగనిరోధకశక్తి బలహీనమైపోయిన వృద్ధులు లేనిపోని వ్యాధుల బారినపడుతూ నానా బాధలు పడుతున్నారు. అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో ప్రజలకు వైరల్ ఫీవర్స్‌తో పాటు, డయేరియా, డెంగ్యూ తదితర ప్రాణాంతక వ్యాధులు కూడా వస్తున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం ఉండడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒక్క నగరంలోనే కాక, జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల్లో, గ్రామాల్లోనూ, ప్రతి పంచాయితీలోనూ ఇదే పరిస్థితి. పారిశుద్ధ్య పరిరక్షణకు నిధులున్నా సిబ్బంది, అధికారులు అనేకమంది ఉన్నా పారిశుద్ధ్య పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఉంది. ముఖ్యంగా నగరంలో విషజ్వరాలు మరింతగా ప్రబలుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, పారిశుద్ధ్యాన్ని పరిరక్షించకపోవడంతో, ఎక్కడ చూసినా దుర్గంధమే తాండవిస్తోందని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అనేకరకాల వ్యాధుల బారినపడి ఆసుపత్రులకు వెళ్తే ఆ పరీక్షలు ఈ పరీక్షలని అధికమొత్తంలో డబ్బు గుంజేసుకుంటున్నారని, ఈ బాధలనుంచి తమను కాపాడేదెవరని ప్రజలు మరింతగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇకనైనా, జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు నగరంలోని వీధులను, ప్రధానరోడ్లను స్వయంగా పరిశీలించి, గుంతలు పూడ్పించి రోడ్లను బాగుచేసేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న విషజ్వరాలను నివారించడానికి, అధ్వాన్నంగా ఉన్న పారిశుద్ధ్య పరిస్థితిని వెంటనే మెరుగుపరచడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఆరాధనకు భారీ ఏర్పాట్లు

## 17 లక్షలతో శ్రీ వెంకయ్యస్వామి భక్తులకు వసతి సౌకర్యాలు





నెల్లూరు సమీపంలోని వెంకటాచలం మండలం గొలగమూడి గ్రామంలో వెలసివున్న అవధూత, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి 24వ తేది వరకు స్వామివారి 35వ ఆరాధన ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని ఆశ్రమ కార్యనిర్వహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం తెలియజేశారు. గొలగమూడిలోని వెంకయ్యస్వామి ఆశ్రమ కార్యాలయంలో ఈనెల 13న ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వామివారి ఆరాధనా మహోత్సవాలకు సుమారు అయిదు లక్షల మంది దాకా భక్తులు విచ్చేయనున్నట్లు అంచనా వేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల రోజుల్లో ప్రతిరోజూ ఉదయం, రాత్రి స్వామివారికి వాహనసేవలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 17 లక్షల రూపాయలతో వసతి సౌకర్యాలు, ప్రాథమిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వామివారి దర్శనం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ ఉత్సవాల సందర్భంగా రూ.50ల టికెట్‌తో ప్రత్యేక దర్శన ఏర్పాటు కూడా చేస్తున్నామన్నారు. భక్తుల కోసం లక్ష లడ్డూలను సిద్ధం చేస్తున్నామన్నారు. పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం నిత్యాన్నదానంతో పాటు, స్వామివారి ఆరాధన రోజైన 24వ తేదీన నిరంతర అన్నదానం ఉంటుందన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా గొలగమూడి గ్రామంలోకి వచ్చే రెండు మార్గాల్లో పార్కింగ్‌కు స్థలం కేటాయించామని, భక్తుల సౌకర్యార్థం ఈ ఉత్సవాల రోజుల్లో ఆశ్రమం ఆధ్వర్యంలో, ఇస్కపాళెం ఆరోగ్యకేంద్రం, పిఎంపి ఆధ్వర్యంలో నిరంతర వైద్యశిబిరాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఆర్టీసి బస్సులు కూడా భక్తులకు అందుబాటులో ఉంటాయని, ఆర్టీసీవారు పది నిమిషాలకో బస్సును ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. స్వామివారి ఆరాధనోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తుల భద్రత దృష్ట్యా ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులందరూ భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి ఆరాధనోత్సవాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చి, స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## నృసింహస్వామికి

# లక్ష తులసీదళార్చన



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఈనెల 12న శ్రావణిపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు స్వామివార్లకు వైభవంగా లక్ష తులసీ దళార్చన, లక్ష కుంకుమార్చనలతో పాటు విశేషమైన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భారీ మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఈ విశేష పూజలు చేపట్టారు. తొలుత దేవేరులతో శ్రీవారిని శోభాయమానంగా అలంకరించారు. పల్లకిపై ఊరేగింపుగా తీసుకువచ్చి మండపంలో వేంచేపు చేసి పూజలు నిర్వహించారు. శ్రీ మహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన తులసీ దళాలతో లక్ష తులసీదళార్చన నిర్వహించారు. అదేవిధంగా ఆదిలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులతోపాటు, ఆలయ కమిటీ ఛైర్మెన్ తానంకి నానాజీ దంపతులు, ఆలయ మాజీఛైర్మెన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, ట్రస్టీలు పీర్ల సోమయ్య, రావి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

# అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



అవినీతి కుంభకోణాలు, అక్రమాలు, బెట్టింగ్ వ్యవహారాలు ఇలా అనేకరకాల అక్రమాలతో జిల్లా సర్వనాశనం కాకముందే అలాంటి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్ రెడ్డి అన్నారు. ఈ నెల 14న ఆయన బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గతంలో జిల్లాలో పనిచేసిన ఎస్పీ శ్రీనివాసులురెడ్డి మాఫియాలను అంతమొందించడానికి ఉక్కుపాదం మోపారని, ప్రస్తుతం ఉన్న ఎస్పీ రామకృష్ణ కూడా తన విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో అవినీతి అక్రమాలు పెరిగిపోతున్నాయని, క్రికెట్ బెట్టింగ్ మాఫియా, పసుపు కుంభకోణం, ఇసుక–ఎర్రచందనం అక్రమరవాణా, నీరు–చెట్టు, ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు, విద్యుత్‌శాఖలో అవినీతి, ఏసి స్టేడియంకు సంబంధించిన నిధుల్లో అక్రమాలు ఇలా అనేక రకాల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని, జిల్లాకు చెడ్డపేరు తెచ్చే ఇలాంటి అక్రమాలను వెంటనే నిరోధించేందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు జిల్లా అధికారులంతా కలసి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని, ఈ అక్రమాలపై ప్రజాసంఘాలు కూడా గళమెత్తాల్సి ఉందన్నారు. తప్పు చేసిన వారు ఎవరెంతటివారైనా సరే ఉపేక్షించాల్సిన అవసరం లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కరణం భాస్కర్, శ్రీనివాసులురెడ్డి, కాకరపర్తి జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

# పౌష్టికాహార దాతలకు సత్కారం

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో వేసవిలో జరిగే క్రీడా శిక్షణా శిబిరాల్లో పాల్గొనే ఎంతోమంది క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీకి సహకరించిన దాతలకు ఈ నెల 13న ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామి నాయుడు పాల్గొని పౌష్టికాహార దాతలను అభినందించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వారు చేస్తున్న సత్కార్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేలూరు రంగారావు, కార్యదర్శి రమేష్‌బాబు, డాక్టర్ అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రధాని నరేంద్రమోడీతో....

# ఢిల్లీలో నెల్లూరోళ్ళు

తెలుగుజాతి గర్వించే స్థాయిలో భారత దేశ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడి ప్రమాణస్వీకార మహోత్సవానికి నెల్లూరు ప్రముఖులు పలువురు హాజరయ్యారు. జిల్లాకు చెందిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి దంపతులతో పాటు సిద్ధారెడ్డి రంగారెడ్డి - కవిత, వంశీరామ్ బిల్డర్స్ అధినేత సుబ్బారెడ్డి, గ్లోబల్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డా॥ రవీంద్రనాథ్, నార్ అసోసియేట్స్ ఛైర్మెన్ అనిల్‌రెడ్డిలతో పాటు వెంకయ్యనాయుడుతో అనుబంధమున్న పలువురు నెల్లూరోళ్ళు ప్రత్యేక ఆహ్వానితులుగా ఈ వేడుకలో పాల్గొన్నారు.


బీజేపీ అగ్రనేత అద్వానీతో...


యోగా గురువు జగ్గీ వాసుదేవ్‌తో...



# ఓం నమఃశివాయ

- తీరంలో ధ్వనించిన ఓంకారం
- ద్వాదశ జ్యోతిర్లింగాలను మైపాడు సాగరతీరంలో ప్రతిష్టించిన ఆల్తూరు ఆదినారాయణరెడ్డి

*నిత్యం అలలతో ఘోషించే సాగరతీరం ఆరోజు ఓంకారంతో ప్రతిధ్వనించింది. ఓం నమశ్శివాయ స్మరణలతో ఆ ప్రాంతం శైవక్షేత్రంగా మారిపోయింది. ఓ పక్క సాగరంలో అలలు... మరోపక్క భక్తుల శివనామస్మరణలు... భారతదేశంలో వున్న ద్వాదశ జ్యోతిర్లింగాలను ఒకే చోట దర్శించుకునే అపురూప భాగ్యం. ఈ నెల 14, 15, 16తేదీలలో నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలంలోని మైపాడు సముద్రతీర ప్రాంతంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణమిది.*

ఎన్నో ఏళ్ళుగా ఆధ్యాత్మిక సేవలో తరిస్తూ, ఎన్నో దేవాలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు విరాళాలుగా అందించి భగవంతుని సేవకు అంకితమైన ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, సులోచనమ్మ, వారి కుమారులు ఆల్తూరు గిరీష్‌రెడ్డి - లత, ఆల్తూరు మహేష్‌రెడ్డి - రాధికల ఆధ్వర్యంలో ఈ 12జ్యోతిర్లింగాలతో పాటుగా ఆలయ ప్రాంగణాన్నే కాకుండా ఇక్కడ వెలిసిన విఘ్నేశ్వరాలయాన్ని కూడా వివిధ ప్రాంతాలకు చెందిన దాతలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పెన్నా సిమెంట్స్ పుట్టంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, రవీంద్ర సన్నారెడ్డి, ఆదాల మురళీకృష్ణారెడ్డి, ఆల్తూరు మహేష్ రెడ్డి, ఆల్తూరు గిరీష్‌రెడ్డి, కలికి కోదండరామిరెడ్డి, బి.వి.మోహన్‌రెడ్డి, జి.వి.కె.రెడ్డి, గునపాటి శ్రీధర్‌రెడ్డి, గంటా రమణయ్యనాయుడు, బట్టేపాటి శ్రీనివాసులు రెడ్డి, పూండ్ల వెంకురెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, వి.వెంకటరెడ్డి, వై.వి.రామిరెడ్డి, గునపాటి ప్రసాద్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, చెన్నూరు రాజగోపాలరెడ్డి, చెన్నూరు వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో నిర్మించారు. మైపాడు సముద్ర తీరాన కొత్తగా నిర్మించిన మహా ఆలయ ప్రాంగణంలో జ్యోతిర్లింగ ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ద్వాదశ జ్యోతిర్లింగాలైన కాశీ విశ్వేశ్వరుడు, గుజరాత్‌లోని సోమనాథుడు, శ్రీశైలంలోని మల్లిఖార్జునుడు, ఉజ్జయినీ మహాకాళేశ్వరుడు, ఇండోర్‌లోని ఓంకారేశ్వరుడు, ఉత్తరాఖండ్‌లోని కేదారేశ్వరుడు, మహారాష్ట్రలోని భీమేశ్వరుడు, జార్ఖండ్‌లోని వైద్యనాథుడు, మహారాష్ట్రలోని అనంత నాగనాథ్, తమిళనాడులో రామనాథస్వామి, ఎల్లోరాలో గృహేశ్వరుడు, మహారాష్ట్రలోని త్రయంబకేశ్వరులను దర్శించుకోవాలనే కోరిక ప్రతి భక్తుడికీ ఉంటుంది. అయితే అందరికీ ఆ కోరిక నెరవేరదు. ఎందుకంటే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో జ్యోతిర్లింగంగా ఆ మహాదేవుడు వెలిసివున్నాడు. అయితే భక్తులకు ఆ లోటును తీరుస్తూ మైపాడు తీరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించి ఆ శివుడి పట్ల తనకున్న చిత్తాన్ని చాటుకున్నాడు ఆల్తూరు ఆదినారాయణరెడ్డి. ప్రముఖ వేదపండితులు మాచవోలు రాజశేఖరశాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠా మహోత్సవాలను, అలాగే పరివార దేవతా పూజ, మృత్యుంజయ, ఆయుష్మ హోమాలను, మహా పూర్ణాహుతి పూజలను నిర్వహించారు. 16వ తేదీ సాయంత్రం స్వామివారి శాంతి కళ్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులతో పాటు మైపాడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, నెల్లూరు నగరంతో పాటు పలు ప్రాంతాల నుండి పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి జ్యోతిర్లింగ ప్రతిష్ట మహాకుంభాభిషేకాలను కళ్లారా తిలకించి భక్తిపరవశంతో వెళ్ళారు.







# ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక పూజలు

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదిన నెల్లూరులోని ఇస్కాన్‌మందిరంలో ఎంతో భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. రాధాకృష్ణులకు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో మందిరానికి విచ్చేసిన భక్తులు భజనలు, కీర్తనలు గానం చేశారు. సాయంత్రం బాలకృష్ణునికి నేత్రపర్వంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామివారికి మహాహారతి, 108 వంటకాలతో నివేదన సమర్పించారు. ఈ సందర్భంగా మందిరం అధ్యక్షుడు డా. శుకదేవస్వామి మాట్లాడుతూ, శ్రీకృష్ణ భగవానుని గీతోపదేశం, బోధనలు అందరి జీవితాలకూ మార్గదర్శకమన్నారు. ఈ వేడుకల్లో ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు పాల్గొని శ్రీకృష్ణ భగవానునికి పూజలు చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఢిల్లీరావు, జడ్పీ మాజీ ఛైర్మెన్ చెంచల బాబుయాదవ్, జక్కా కృష్ణారెడ్డి, ఓవస్సీ పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ ఢిల్లీరావు



# మిత్రబంధం

భారత 15వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో తనకున్న చిన్ననాటి మిత్రబంధాన్ని నెల్లూరీయుడు నెల్లూర్ సెంట్రల్ స్కూల్ వ్యవస్థాపకుడు కె.సురేంద్రరావు 'లాయర్'తో పంచుకున్నారు. వెంకయ్యనాయుడితో 5 దశాబ్దాలకుపైగా తనకున్న అనుబంధాన్ని, స్నేహబాంధవ్యాన్ని గుర్తు చేసుకుంటూ దేశం గర్వించే స్థాయికి తన చిన్ననాటి సహచరుడు ఎదగడం ఆనందంగా వుందని, వెంకయ్య తన మిత్రుడని చెప్పుకోవడానికి గర్వపడుతున్నానని అన్నారు.

## 'ప్రభా'తం

# 'నవభారత్' వైపు నడుద్దాం



71వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భారత ప్రధాని నరేంద్రమోడీ ఢిల్లీలోని ఎర్రకోటపై నుంచి చేసిన ప్రసంగం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉండి దేశప్రజలందరినీ బాగా ఆకట్టుకుంది. దేశంలోని దుర్నీతులను, దురవస్తలను పారద్రోలి నవభారతాన్ని నిర్మించుకోవాలని ప్రధాని ఇచ్చిన పిలుపు యువతలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. అందుకనుగుణంగా నవభారత్ లక్ష్యాల సాధనకు ప్రజలంతా సమిష్టి కృషితో తోడ్పాటును అందివ్వాలి. అప్పుడే ఆ లక్ష్యం నెరవేరుతుంది..నవభారత్ సాకారమవుతుంది.

"ఈ స్వాతంత్ర్యదినం మనకెంతో ప్రత్యేకమైనది. క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏళ్ళు పూర్తిచేసుకున్న సంవత్సరమిది. సబర్మతీ ఆశ్రమం, చంపారన్ సత్యాగ్రహాలకు 75 ఏళ్ళు, లోకమాన్య బాలగంగాధర తిలక్ 'స్వరాజ్యం నా జన్మహక్కు' అని పిలుపునిచ్చి ఈ ఏడాదికి వందేళ్ళయ్యాయి. దేశప్రజలను ఒకటిచేసిన గణపతి ఉత్సవాలు మొదలై ఈ ఏడాదికి 125 ఏళ్ళయ్యాయి.1942-47 మధ్య దేశవ్యాప్తంగా ఐకమత్యం వెల్లివిరిసింది. ఇప్పుడు కూడా మనం అదే స్ఫూర్తిని కనపరచాలి. 2022లో ఆ స్ఫూర్తిదీప్తిని మరింతగా చాటాలి"... అంటూ 71వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భారత ప్రధాని నరేంద్రమోడీ ఢిల్లీలోని ఎర్రకోటపై నుంచి చేసిన ప్రసంగం ఎంతో ఉత్తేజభరితంగా.. స్ఫూర్తిదాయకంగా ఉండి దేశప్రజలందరినీ బాగా ఆకట్టుకుంది. అందులోనూ స్వాతంత్ర్యదినోత్సవం రోజు, శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం కూడా అదే రోజు రావడంతో ఈ వేడుకలు మరింత శోభాయమానమయ్యాయి.

ప్రధాని ప్రసంగం ఆద్యంతం ఎంతో ఆసక్తిగా సాగింది. 'దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వారికి నూటపాతిక కోట్ల మంది ప్రజల తరఫున శిరసు వంచి అభివందనం చేస్తున్నా'..నంటూ ప్రధాని ప్రసంగం అనర్ఘళంగా సాగిపోయింది. స్పష్టమైన ప్రధాని వాక్ఝురీప్రవాహంలో ఎన్నో బాసలు, ఎన్నో ఆశలు, ఎన్నో ఉద్వేగాలు.. ఎన్నెన్నో నిర్ణయాలు జలపాతంలా దూసుకువచ్చాయి. దుర్నీతులను, దురవస్తలను పారద్రోలి నవభారతాన్ని నిర్మించుకోవాలన్నదే లక్ష్యంగా అందరూ ముందుకు సాగాలని ప్రధాని ఇచ్చిన పిలుపు యువతలో ఉత్సాహాన్ని ఉరకలు వేయించింది. భారతదేశ ప్రగతి రథాన్ని పరుగులు తీయించడానికి అవసరమైన అన్ని రకాల వనరులు, ప్రతిభాపాటవాలు మనకు పుష్కలంగా ఉన్నాయని, ఉన్నతమైన లక్ష్యాల సాధన కోసం ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషిచేయాలని ప్రధాని ఆకాంక్షించారు. వచ్చే ఏడాది ఆరంభానికి ఈ శతాబ్దంలో నవయవ్వనంలోకి అడుగుపెట్టే యువత సంఖ్య 20 కోట్లకు చేరుకుంటుందని, వారంతా కొత్త ఉత్సాహంతో సరికొత్త ఆలోచనలతో ముందుకు వస్తున్నారని, వారి కలలను సాకారం చేసేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టించడం కోసం మనందరం కలిసి 'నవభారత్'ను నిర్మిద్దామన్న ప్రధాని పిలుపు దేశప్రజలకు ఎంతో చైతన్యాన్నిచ్చింది. దేశంలోని 125 కోట్లమంది అంతా సమానమేనని, మనం ఏ ప్రాంతం వారమనే ధ్యాస లేకుండా దేశాభ్యున్నతికి అందరూ చేయిచేయి కలిపి కలసికట్టుగా పని చేయాలని, సమృద్ధ భారత్ సాధనకు బలమైన ఆర్థిక వ్యవస్థ కావాలని, 21వ శతాబ్దంలోకి భారత్ దూసుకెళ్ళాలని ఆయన అంటూ, 75వ స్వాతంత్ర్యదినోత్సవం నాటికి మనమంతా ఐకమత్యంతో, మనశక్తినంతా కేంద్రీకరించి ఎలాంటి భీతి లేని, సంపన్నమైన, సుదృఢమైన దేశాన్ని ఆవిష్కరింపజేసేందుకు కృషి చేయాలన్నారు. అదే మన నూతన భారత్ కావాలని ప్రధాని ఆకాంక్షించారు. ప్రధాని ప్రసంగంలోని ప్రతిమాటా ప్రజలను ఎంతో ఆకట్టుకుంది. ప్రధాని తన ప్రసంగంలో ఆధార్ నుంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దాకా, రహదారుల అభివృద్ధి నుంచి జమ్మూకాశ్మీర్‌కు పునర్వైభవం కలిగించే విషయం దాకా ఎన్నో అంశాలను ప్రస్తావిస్తూ 54 నిమిషాల పాటు ధారాళంగా ప్రసంగించారు. దేశరక్షణే తమ ప్రధమ ప్రాధామ్యమన్నారు. అందులో రాజీపడేదే లేదన్నారు. సముద్రంలోనైనా సరిహద్దుల్లోనైనా..ఆన్‌లైన్‌లోనైనా ఆకాశం లోనైనా..ఎలాంటి భద్రతాపరమైన సమస్య ఎదురైనా ధీటుగా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని స్పష్టం చేశారు. దాదాపు దేశంలోని అన్ని రంగాలనూ ఆయన ప్రస్తావించారు. దేశప్రగతికి ప్రభుత్వం చేస్తున్న అనేకరకాల అభివృద్ధిపనులను ఈ సందర్భంగా ప్రధాని వివరంగా ప్రసంగించారు. ఏళ్ళ తరబడి జనం సొమ్ము దోచుకున్నవారికి మనశ్శాంతి లేకుండా చేశామన్నారు. ఇప్పటికే దేశంలో 1.25 లక్షల కోట్ల నల్లధనాన్ని వెలికితీశామని, అవినీతిపై మహాసంగ్రామమే చేస్తున్నామని అన్నారు. డొల్ల కంపెనీల భరతం పడతామన్నారు. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ఉగ్రవాదంపై పోరాటంలో ఇప్పుడు భారత్ ఒంటరిది కాదని, ప్రపంచంలోని అనేకదేశాలు ఉగ్రవాదంపై ఉమ్మడిపోరుకు మద్దతునిస్తున్నాయన్నారు. కశ్మీర్ గురించి ప్రస్తావిస్తూ, గుప్పెడుమంది వేర్పాటువాదులు కశ్మీర్‌లో అలజడి సృష్టించేందుకు రకరకాల ఎత్తులు వేస్తున్నారని, వాటిని తిప్పికొట్టి కశ్మీర్‌కు పూర్వవైభవం తీసుకొస్తామని స్పష్టం చేశారు. తీవ్రవాదులు, ఉగ్ర వాదులపై మెతకవైఖరి అవలంబించే ప్రసక్తే ఉండదన్నారు. మతవాదం, కులతత్వం విషంతో సమాన మన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఒక ఆసుపత్రిలో ఇటీవల చిన్నారుల మరణాలను ప్రస్తావిస్తూ, ఆ ఘటన ఎంతో విషాదకరమని అంటూ ప్రధాని వారికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఇకపోతే, ఆహారధాన్యాల ఉత్పత్తిలోనూ, అంతరిక్ష పరిశోధనల్లోనూ మనదేశం సాధించిన కీర్తి తక్కువేమీ కాదని, ఇతర దేశాల ఉపగ్రహాలను సైతం అంతరిక్షం లోకి పంపడంలో మన ఇస్రో రికార్డులు సృష్టిస్తోందని ప్రధాని ఈ సందర్భంగా అభినందించారు. ఎవరో రావాలి.. ఏదో చేయాలి అనే నైరాశ్యపు ధోరణి వదిలి సరికొత్త ఉత్తేజంతో ప్రగతిపథంలో దూసుకుపోవా లన్నారు. ఇలా ఎన్నో రకాల అంశాల మీద ప్రధాని చేసిన వివరణాత్మక ప్రసంగం ఎంతో ఉత్తేజభరితంగా, ఆలోచనాత్మకంగా ఉండి దేశప్రజలను బాగా ఆకట్టుకుంది. దేశప్రజలంతా సుభిక్షంగా సుఖశాంతులతో జీవించాలని, నీతివంతమైన..ఆరోగ్యవంతమైన సమాజంతో సురాజ్య నిర్మాణం సాధించుకోవాలని ప్రధాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఏదేమైనా, అటు రాష్ట్రపతి ప్రసంగంలోనూ, ఇటు ప్రధాని ప్రసంగంలోనూ ప్రకటితమైన నవభారత్ లక్ష్యాలు దేశానికి మార్గదర్శకాలన్నది స్పష్టం. ఆ లక్ష్యసాధనకు అటు ప్రభుత్వాలే కాక, దేశంలోని ప్రజలంతా సమిష్టికృషిని తోడ్పాటుగా అందివ్వాలి. అప్పుడే ఇలాంటి బృహత్తరమైన లక్ష్యాలను చేరుకోగలం.. ఆ కలలను సాకారం చేసుకోగలం!...

# నమో వేంకటేశాయ రథానికి అపూర్వ స్వాగతం

శ్రీ వెంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో 'శ్రీ నమోవేంకటేశాయ రథయాత్ర' నెల్లూరు నగరానికి ఈ నెల 12వ తేదీ రాత్రి చేరింది. భక్తులు, నగర ప్రముఖులు స్వామివారి రథానికి అపూర్వ స్వాగతం పలికారు. ఈ రథం శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం వ్యవస్థాపకుడు పుల్లగూర్ల సాయిరెడ్డి ఆధ్వర్యంలో 15వ పర్యాయం హైదరాబాద్‌లో జూలై 1వతేదీన రథయాత్ర ప్రారంభమైంది. స్వామివారికి భక్తులు సమర్పించిన శ్రీ వేంకటేశ్వర మహామంత్రం కాగితాలను సేకరించి తిరుమల్లో స్వామివారికి సమర్పించి భక్తుల సంకల్పాలను నెరవేర్చేలా తిరుమలలో హోమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా హైదరాబాదు నుంచి జిల్లాల వారీగా తిరుగుతూ వెంకటేశ్వర నామాన్ని ప్రచారం చేస్తూ భక్తులు సమర్పించిన మహామంత్ర సంకల్ప కాగితాలను సేకరిస్తూ కావలి మీదుగా రథం నెల్లూరుకు చేరుకుంది.

నెల్లూరులో పప్పులవీధి మహాలక్ష్మి ఆలయం వద్ద రథానికి భక్తులు విశేష పూజలు చేసారు. హుండీల్లో శ్రీ వేంకటేశ్వర మహామంత్రాల చీటీలను వేశారు. రథానికి స్వాగతం పలికిన వారిలో నెల్లూరుజిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, సింహపురి వాణిజ్య మండలి అధ్యక్షుడు శ్రీరాం సురేష్, అవోపా అధ్యక్షుడు వెలుగొండయ్య తదితరులున్నారు. అనంతరం రథం మాగుంట లే అవుట్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరింది. అక్కడ భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్న అనంతరం తిరిగి రథం పప్పులవీధికి చేరి రాత్రికి అక్కడే బసచేసి ఉదయం తిరుమలకు బయలుదేరి వెళ్లింది. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం కన్వీనర్ శివనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

## మహిళా పోలీసుస్టేషన్ డిఎస్పీకి
# అదనపు బాధ్యతలు

నెల్లూరు మహిళా పోలీసుస్టేషన్ డిఎస్పీ శ్రీనివాసచారికి డిటిసి(డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్) డిఎస్పీగా అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. డిటిసి డిఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న చంద్రశేఖర్ అనారోగ్యం కారణంతో సెలవులో ఉన్నారు. ఈ క్రమంలో శ్రీనివాసాచారికి బాధ్యతలు అప్పగించారు.

# 'మాతృదేవోభవ' ఆవిష్కరణ




ప్రముఖ కవి ముసులూరు నారాయణ రచించిన 'మాతృదేవోభవ' పుస్తకాన్ని పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో ఈనెల 12న ఆవిష్కరించారు. నెల్లూరు పురమందిరంలో జరిగిన ఈ పుస్తకావిష్కరణలో పెరసం అధ్యక్షుడు అవ్వారు శ్రీధరబాబు, కార్యదర్శి గుండాల నరేంద్రబాబు, మోపూరు పెంచలనరసింహం, గోవిందరాజుల సుభద్రాదేవి తదితరులు పాల్గొని ఎంతో ఉన్నతమైన భావాలతో ముసులూరు నారాయణ ఈ పుస్తకాన్ని రచించారని అభినందించారు. ఈ పుస్తకావిష్కరణను పురస్కరించుకుని పెరసం ఆధ్వర్యంలో 'స్నేహం' అనే అంశంపై కవిసమ్మేళనం జరిగింది. పలువురు కవులు పాల్గొని తమ కవితలు చదివి వినిపించి అందరి ప్రశంసలు అందుకున్నారు.




# అది ఎవరి సొత్తు?

ఉపఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చెప్పి నంద్యాలలో చంద్రబాబు నాయుడు వేలకోట్లు కుమ్మరిస్తున్నారు. అది ఎవరి సొత్తు. రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన చోట మాత్రమే జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను నంద్యాలలో అవసరంలేని చోట్ల కూడా ఖర్చు చేస్తున్నారు. నంద్యాలలో గెలుపు కోసం చంద్రబాబు తన హెరిటేజ్ కంపెనీని అమ్ముకుని ఎంత ఖర్చుచేసినా ప్రజలకొచ్చే ఇబ్బందేమీ లేదు. కాని, తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రజాధనాన్ని ఇలా ఒక ప్రాంతంలో ఖర్చు పెట్టడం న్యాయమా? **– చింతల గోపి, జలదంకి.**

# సెల్‌ఫోన్‌కు దూరంగా పెంచండి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మానవ వికాసానికి ఉపయోగపడాలే గాని, మానవ వినాశనానికి కాదు. కాని, ఇప్పుడు సెల్‌ఫోన్‌ల మూలంగా మంచికంటే చెడే ఎక్కువగా జరుగుతుంది. సెల్‌ఫోన్‌లు, వాట్సాప్‌లు, ఫేస్‌బుక్‌లు వచ్చాక మనుషుల మధ్య సంబంధాలు మెరుగుపడాల్సిందిపోయి దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా స్కూల్స్, కాలేజీ విద్యార్థులకు సెల్‌ఫోన్‌లు ఇస్తుండడంతో వారు తప్పుదారి పడుతున్నారు. వీలైనంత వరకు పిల్లల చేతికి స్మార్ట్‌ఫోన్‌లు అందకుండా చేయాలి.

**సి.రాజమన్నార్, నెల్లూరు.**

# టిటిడి కళ్యాణ మండపాలు నిర్మించాలి

హైందవ సంస్కృతిలో వివాహానికి విశేష ప్రాధాన్యత వుంది. ఈ కాలంలో పెళ్ళి ఖర్చులు విపరీతమైపోయాయి. పేద, మధ్య తరగతి వాళ్ళు కూడా కాలాన్ని బట్టి కళ్యాణ మండపాలలోనే పెళ్లిళ్ళు చేసుకోవాల్సి వస్తోంది. గతంలో శుభ్రంగా గుళ్లలో పెళ్లిళ్లు చేసుకునేవాళ్లు. ఖర్చు చాలా తక్కువయ్యేది. ఇప్పుడు కళ్యాణ మండపాలలో వివాహమంటే ఖర్చు తడిసి మోపెడవుతుంది. ప్రతి జిల్లా కేంద్రంలోనూ, ప్రధానపట్టణాలలోనూ టీటీడీ కళ్యాణ మండపాలున్నాయి. వీటిలో చాలా మండపాలు పాతవైపోయి వివాహాలు జరగడం లేదు. టీటీడీ వాళ్ళు వీటిపై దృష్టిపెట్టి ఆధునీకరించాలి. అలాగే ప్రతి మండల కేంద్రంలోనూ కళ్యాణ మండపాలు నిర్మించే దిశగా టీటీడీ ఆలోచించాలి. ఈ కళ్యాణ మండపాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. కళ్యాణ మండపాలు నిర్మించి నామమాత్రపు ధరలతో వివాహాలకు ఇచ్చేలా టీటీడీ అధికారులు చర్యలు తీసుకోవాలి. **– పైడిపాటి నరసింహారావు, ఆత్మకూరు.**

## నంద్యాల వీధుల్లో...

# నెల్లూరు నేతలు



*రాజకీయాలలో ఎత్తులకు పైఎత్తులు వేయడంలోనూ, వ్యూహాలకు ప్రతివ్యూహాలు పన్నడంలోనూ నెల్లూరు నాయకులు బ్రాండ్ అంబాసిడర్‌లు. రాజకీయంగా ఒక పని అప్పగిస్తే కూడు, నీళ్లు మర్చిపోయి అతుక్కుపోయి పని చేస్తారు. కాబట్టే రాష్ట్ర స్థాయిలో కూడా ఆయా పార్టీలు నెల్లూరు నాయకులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తుంటాయి.*

ఇప్పుడు నంద్యాల ఉపఎన్నికల్లో నెల్లూరు నాయకుల హడావిడి ఎక్కువుగా కనిపిస్తోంది. నంద్యాలలోని అన్ని సందుల్లో స్థానిక నాయకులు, కార్యకర్తల కంటే నెల్లూరు నుండి వెళ్లిన నాయకులే ఎక్కువుగా కనిపిస్తున్నారు. వీళ్లు నెల్లూరోళ్లంటరా... అని అక్కడి జనం వీళ్ళను ఆసక్తిగా చూస్తున్నారు. ఒక పని అప్పగిస్తే నెల్లూరోళ్లు ఒళ్లంతా పూసుకుని తిరుగుతారనే పేరుంది కదా! ఇప్పుడు నంద్యాలలోనూ అదే జరుగుతోంది. నంద్యాల ఉపఎన్నికలనుకున్నప్పటి నుండే జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ అక్కడ దించేసింది. నంద్యాలలో తెలుగుదేశం అభ్యర్థి గెలుపు కోసం నిలబడ్డ అభ్యర్థికంటే కూడా ఈయన ఎక్కువ కష్టపడుతున్నాడు. ఇప్పుడు నంద్యాలలో ఆయన పడుతున్న కష్టం 2014 ఎన్నికల్లో సర్వేపల్లిలో పోటీచేసినప్పుడు పడుంటే గెలిచి ఉండేవాడేమో? మంత్రిని చేసాక సోమిరెడ్డికి చంద్రబాబు అప్పగించిన పెద్ద టాస్క్ నంద్యాల ఉపఎన్నిక. ఆయనను ఎమ్మెల్సీని చేసాక కడప స్థానిక ఎమ్మెల్సీ బాధ్యతను అప్పగిస్తే సోమిరెడ్డి అక్కడ తన ప్రతిభాపాటవాలను నిరూపించుకోవడం తెలిసిందే! ఇప్పుడు నంద్యాలలో ఆయన టాలెంట్ ఎంతవరకు పనిచేస్తుందో చూడాలి! ఇక్కడ తెలుగుదేశం అభ్యర్థి పరంగా ఓట్ల కోసం పన్నుతున్న వ్యూహాలన్నీ కూడా సోమిరెడ్డి మైండ్‌లో నుండి పుట్టుకొస్తున్నవే! ఇక జిల్లా మంత్రి పి.నారాయణ కూడా తన బాధ్యతలు తాను చూస్తున్నాడు. నెల్లూరు రోడ్లపై కనిపించే ఈ మంత్రుల అనుచరులు, కార్యకర్తలు కూడా ఇప్పుడు నంద్యాల రోడ్లపై తచ్చాడుతున్నారు.

వైసిపి నుండి చూస్తే ఆ పార్టీ ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్ రెండు వారాలుగా అక్కడే ప్రచార కార్యక్రమాలలో వున్నాడు. ఆ తర్వాత కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలతో పాటు మండలస్థాయి నేతలు కూడా నంద్యాలకు వెళ్ళి తమ బంధువులను, మిత్రులను కలుసుకుంటూ వైసిపి అభ్యర్థిని గెలిపించాల్సిందిగా ప్రచారం చేస్తున్నారు. ఇలా నంద్యాలలోనూ నెల్లూరు నేతలదే పెత్తనమైపోయింది.

## ప్రతి వ్యక్తి...

# సమాజసేవలో పాలు పంచుకోవాలి

### - వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ప్రతి వ్యక్తి సమాజ సేవలో పాలు పంచుకోవాలని ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

ఈ నెల 15వ తేదీ నెల్లూరు కొండాయపాళెం రోడ్డులోని జనహిత – వాత్సల్య స్కూలులో జరిగిన 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకావిష్కరణ చేసి వందనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న స్వరాజ్యాన్ని మనం నిలబెట్టుకోవాలన్నారు.




ఈ కార్య క్రమంలో కిమ్స్ హాస్పిటల్ ప్రముఖ కార్డియాలజిస్ట్ డా॥ సి.ఎస్. శ్రీనివాసరాజు, శ్రీరామకృష్ణ సేవాసమితి కార్యదర్శి మోడెం మల్లిఖార్జున, పి.రామదండు, డా॥ కె.నరశింహారెడ్డి, పి.సంజీవరెడ్డి, సామంతు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వాత్సల్య పిల్లలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

## బెట్టింగ్ తీగ లాగుతూనే వున్నారు...

# డొంక కదులుతూనే ఉంది

నెల్లూరుజిల్లాకు పిహెచ్‌డి రామకృష్ణ అనే ఒక ఎస్పీ వస్తాడని, బెట్టింగ్ రాయుళ్ళపై ఈ స్థాయిలో విరుచుకు పడతాడని, బుకీల బొక్కలు విరిచేస్తాడని ఎవరూ ఊహించ లేదు. అసలు బెట్టింగ్‌పై ఈ స్థాయిలో పోలీస్ ఆపరేషన్ వుంటుందని ఎవరూ అంచనా కూడా వేయలేదు. తిన్నామా, తిరిగామా, పడుకున్నామా అన్న పాలసీని అనుసరించే ఎస్పీలు వస్తే బెట్టింగే కాదు, అన్ని రకాల అవలక్షణ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగిపోతుంటాయి. సిన్సియర్ పోలీసు ఆఫీసర్లు వస్తే రౌడీయిజాన్ని అణచి వేయడం, దొంగతనాలను అరికట్టడం, ట్రాఫిక్‌ను దారిలో పెట్టడం వంటివి ప్రధానంగా జరుగుతుంటాయి. కాని, రామకృష్ణ వచ్చీరావడంతోనే బెట్టింగ్‌పై ఉక్కుపాదం మోపాడు. దాదాపు రెండువారాల పాటూ ఈ కేసులో లోతైన విచారణ నిర్వహించి ప్రధాన బుకీలను, పంటర్లను, బెట్టింగ్ ఆడేవాళ్లను అందరూ కలిపి 115మందిని దాకా అరెస్ట్ చేసి కోర్టుకు పెట్టడం తెలిసిందే! కోర్టు మెట్లెక్కి నిందితులకు బెయిల్ రావడంతోనే ఈ కేసును అక్కడితో వదిలేస్తారనుకున్నారు. అయితే ఎస్పీ మళ్ళీ వదల్లేదు. జ్యూడిషియల్ కష్టడీలో వున్న ఐదుమంది ప్రధానబుకీలు కృష్ణసింగ్, షేక్ షంషీర్, డిటిఎస్ రమేష్, తన్నీరు రమేష్‌కుమార్, అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డిలను తిరిగి కోర్టు అనుమతితో పోలీసు కష్టడీకి తీసుకుని విచారించారు. ముఖ్యంగా బుకీలకు జిల్లాలోని ఇతర ప్రముఖులకు మధ్య వున్న సంబంధాలను బయటకు తెచ్చే క్రమంలోనే ఆయన విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. కాగా, బెట్టింగ్స్ మాఫియాతో అధికార, ప్రతిపక్ష పార్టీలలోని పలువురు నాయకులకు సంబంధాలున్నట్లు వెల్లడైంది. వైసిపి నాయకులను మాత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. అధికారపార్టీకి చెందినవాళ్ళు మాత్రం పరారీలో వున్నారు. వీళ్లను కూడా పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు. మొత్తానికి ఎస్పీ ఆ పార్టీ ఈ పార్టీ అని లేకుండా అందరికీ చెమటలు పట్టిస్తున్నాడు.



*తాళం వేసిన ఇళ్లను పగటిపూట రెక్కీ నిర్వహించి గుర్తించడం... రాత్రి పక్కా స్కెచ్‌తో ఆ ఇంటిని దోచేయడం... ఏదన్నా ఊరికి వెళ్లిన యజమానులు తిరిగి ఇంటికొచ్చే దాకా తమ ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించలేని పరిస్థితి... ఎందుకంటే నగరంలో మన పక్కింటోళ్లెవరు... ఎదురింటోళ్లెవరో కూడా తెలుసుకోలేని కృత్రిమ సమాజంలో బ్రతుకుతున్నాడు మనిషి. కాబట్టే దొంగల పని సులువుగా జరిగిపోతూ వచ్చింది. బంధువుల ఇళ్లకో, పెళ్లికో, చావుకో, పుణ్యక్షేత్రాలకో, ఇతర ప్రాంతాలలో చదువుకుంటున్న బిడ్డల వద్దకో నాలుగైదు రోజులు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇంటికి తాళం బిగించివెళ్లాలి. అలా ఇంటికి తాళం వేసేటప్పుడే మనసు దొంగల భయంతో పీకుతుంటుంది. అయినా చేసేదేమీ లేక దేవుడిపై భారం వేసి, ఇంటికి తాళం వేసి పోతుంటారు. ఇలాంటి వారి కోసమే నెల్లూరు పోలీసులు ఒక వినూత్న యాప్‌ను తీసుకొచ్చారు.*

# ఇల్లు మీది... భద్రత మాది

- దొంగాటలకు చెల్లుచీటీ
- కొత్త యాప్‌తో సొమ్ముకు గ్యారంటీ

ఇక నుండి ఇళ్లకు తాళం వేసి ఊర్లకు వెళ్లేవాళ్ళు దేవుడిపై భారం వేయకుండా, పోలీసులకు ఆ భారం, బాధ్యత ఇప్పగిస్తే, అంతా తామే చూసుకుంటామని, మీ ఇంటిని మా ఇంటిలా చూసుకుంటామని భరోసా ఇస్తున్నారు. ఈ మేరకు దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ రామకృష్ణ ఈ నెల 13వ తేదీ విలేకరుల సమావేశం పెట్టి వెల్లడించారు.

ఇంటికి తాళం వేసి వెళ్లే వారి కోసం ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. మొదట దీనిని నెల్లూరులోని అన్ని నగర పోలీసుస్టేషన్లతో పాటు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా అమలు చేసారు. గృహస్తులు ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపి పోలీస్ అనే యాప్‌ను ప్లే స్టోర్, ఆపిల్ స్టోర్, విండోర్ స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ యాప్‌లో లాగిన్ అవ్వాలి. అందులో పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ వివరాలు పొందుపరచాలి. అప్పుడు ఫోన్‌కు సీక్రెట్ కోడ్ వస్తుంది. ఆ కోడ్‌ను యాప్‌లో ఎంటర్ చేయగానే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఇంటికి తాళం వేసి వెళ్లదలచుకున్న వారు 'రిక్వెస్ట్ పోలీస్ వాచ్' అనే దానిని నొక్కితే ఏఏ తేదీలలో ఇళ్లలో వుండరో, ఇంటి నుండి ఎన్ని గంటలకు వెళతారు, ఇంటికి ఎన్ని గంటలకు వస్తారు... అనే వివరాలు అడుగుతుంది. ఆ వివరాలు నమోదు చేసిన వెంటనే సంబంధిత స్టేషన్ సిబ్బంది అలర్ట్ అవుతారు. వైర్‌లెస్‌తో కూడిన మోషన్ కెమెరాను పోలీసులు తెచ్చి వివరాలు అందించిన వారి ఇంటికి బిగిస్తారు. ఇళ్లంతా ఈ కెమెరా కన్నుల్లోకి వస్తుంది. ఇంట్లోకి ఎవరైనా ప్రవేశించగానే అలారమ్ మోగడంతో పాటు యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న యూజర్‌కు, పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు సంకేతాలు వెళతాయి. వెంటనే పోలీసులు లోకేషన్‌ను గుర్తించి అక్కడకు చేరుకుంటారు. మోషన్ కెమెరాలో ఫోటోలతో పాటు వీడియో కూడా చూడొచ్చు. ఈ యాప్‌ను మొదట అనంతపురంలో అమలు చేయగా 54వేల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. నెల్లూరుకు 50 మోషన్ కెమెరాలను తెచ్చారు. ప్రస్తుతం నెల్లూరు నగరం, రూరల్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోనే దీనిని అమలు చేసినా, త్వరలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో అమలు చేయనున్నారు. గృహస్తులకు రూపాయి ఖర్చు లేకుండా, వారింటికి బీమా చేసినట్లుగా దీమా కల్పిస్తూ పోలీసులు ఈ యాప్‌ను ప్రవేశపెట్టారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ రామకృష్ణ కోరుతున్నారు.

# నెల్లూరు కబుర్లు

## నంద్యాలపై పందేలు

ఓ పక్క పోలీసులు జిల్లాలో బెట్టింగ్ మాఫియా బెండు తీస్తూ నరాలు లాగుతున్నారు. అయినా కూడా జూదాలకు అలవాటు పడ్డ వాళ్లలో ఆ బుద్ధి పోవడం లేదు. క్రికెట్ మ్యాచ్‌ల తర్వాత ఎన్నికలపై ఎక్కువగా పందేలు జరుగుతుంటాయి. 2014 ఎన్నికలప్పుడు కూడా జిల్లాలో ఆయా అభ్యర్థుల గెలుపు మీద, తెలుగుదేశం వైకాపాల గెలుపు మీద కోట్ల రూపాయల పందేలు కాసారు. అలాగే ఇప్పుడు నంద్యాల ఉపఎన్నికల్లో గెలుపెవరి దన్న దానిపై కూడా జిల్లా వ్యాప్తంగా జోరుగా పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నంద్యాలలో తెలుగుదేశం, వైసిపి అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోరు నడుస్తోంది. జిల్లాలో పందేలు కూడా అదే స్థాయిలో నడుస్తున్నాయి. అయితే ఇవి బుకీల ద్వారా కాకుండా రాజకీయాలపై దురద, పార్టీల మీద అభిమానం కొద్ది జరుగుతున్నాయి.

## నెల్లూరులో సంబరాలు



నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈ నెల 11వ తేదీన ఢిల్లీలోని రాష్ట్ర పతి భవన్‌లో ఉపరాష్ట్ర పతిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సమయంలో నెల్లూరులో ఆనంద సంబరాలు అంబరాన్నంటాయి. నెల్లూరులోని బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు పెద్దఎత్తున బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని వెంకయ్య ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని టీవీలలో ఆసక్తిగా తిలకించారు.

## క్రీడాభివృద్ధికి మరింత కృషి



నెల్లూరులో నిర్వహించిన 7వ మినీ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించామని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని టోర్నమెంట్లు నిర్వహిస్తామని నెల్లూరు 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 13వతేదీ ఆదివారం పోటీలు విజయవంతంగా జరగడంపై విఆర్‌సి మైదానంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు 1970 నుంచే ఎన్నో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహించా రని తెలిపారు. వారి సహకారంతోనే జాతీయ స్థాయి పోటీలు ఘనంగా నిర్వహించ గలిగామన్నారు. జిల్లాలోని క్రీడా సంఘాలు, అసోసియేషన్లు సహకారంతో క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపడతామన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు రవికుమార్ మాట్లాడుతూ ఈ క్రీడలు విజయవంతంగా నిర్వహించడంతో జిల్లాకు ఎంతో పేరు వచ్చిందన్నారు. క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


## యుఎన్ఆర్ విద్యార్థుల ప్రతిభ



శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇటీవల 'హనుమంతుడు' అనే అంశంపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో నెల్లూరులోని యుఎన్ఆర్ స్కూల్ విద్యా ర్థులు తమ ప్రతిభ కనపరచి బహుమతులందుకున్నారని ఆ పాఠశాల కరెస్పాండెంట్ యు.నరసారెడ్డి తెలిపారు. తమ విద్యార్థి భవన్‌శంకర్ గుప్తా ప్రథమ బహుమతిని సాధించాడని, పూజిత నాల్గవ స్థానం సాధించి బహుమతి అందుకుందని, అదేవిధంగా మహిత, హేమంతకుమార్‌లు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేసి ఆ విద్యార్థులను అభినందించారు. ఆ విద్యార్థులకు శ్రీరామకృష్ణ సేవాసమితి వారు ధ్రువీకరణ పత్రాలతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారన్నారు.

## ఆటోలకు ఆంక్షలు





**నెల్లూరు నగరంలో ప్రజలకు సమస్యగా, పోలీసులకు సవాల్‌గా వుండేది ట్రాఫిక్. భారత్‌కు చైనాతో డోక్లామ్ సరిహద్దు వివాదమన్నా పరిష్కారమవుతుందేమోగాని, ఈ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం అంత సులభంగా లభించదు.**

నెల్లూరు నగరంలో 70శాతం ట్రాఫిక్ అయ్యప్పగుడి, ఆత్మకూరు బస్టాండ్‌ల మధ్య వున్న ట్రంకురోడ్డు పైనే నడుస్తుంది. ఇటీవలకాలంలో మినీబైపాస్ రోడ్డు మీదకు ట్రాఫిక్ డైవర్ట్ కాబట్టి ట్రంకురోడ్డుపై కొంత ఒత్తిడి తగ్గింది. లేకుంటే ట్రంకురోడ్డులో ట్రాఫిక్ ఇంకా నరకంగా వుండేది. నెల్లూరులో ట్రాఫిక్‌కు ప్రధాన కారణం ఆటోలు. గతంలో దాదాపు 200 టౌన్‌బస్సులుండేవి. ఆటోలు పెరిగి అవి తగ్గిపోయాయి. ఇప్పుడు నెల్లూరులో వున్నన్ని ఆటోలు మెట్రోసిటీలో కూడా వుండవేమోననిపిస్తుంది. ట్రంకురోడ్డులో ఎప్పుడు చూసినా ఆటోల ర్యాలీ జరుగుతున్నట్లుగా వుంటుంది. ట్రాఫిక్‌ను సరిదిద్దడంలో

### చర్యలు చేపట్టిన పోలీస్

భాగంగా జిల్లా ఎస్పీ ఆటోలపై దృష్టిపెట్టారు. ఆటోలకు కొన్ని ఆంక్షలు విధించారు. ఆటోలకు పోలీసుస్టేషన్‌ల వారీగా నెంబర్లు ఇస్తారు. ప్రయాణీకులను పరిమితికి మించి ఎక్కించుకుంటే ఇక భారీ జరిమానాలు కట్టాల్సిందే! ఆటో కెపాసిటి ముగ్గురు ప్రయాణీకులు మాత్రమే. కాని, ఏ ఆటోలోనూ ఐదారు మందికి తక్కువ వుండరు. ఇక నిర్మాణ పనులకు కూలీలను తీసుకెళ్లే ఆటోలలో అయితే పదిమందికి తక్కువ వుండరు. దీనిపై పోలీ సులు ఇక గట్టిగా వుంటారు. పరిమితికి మించి ఎక్కిస్తే కేసులే! నగరంలో ఆటోలకు ఒక పద్ధతి పాడూ లేకుండా నడుస్తుంటాయి. ప్రయాణీకుడు చెయ్యెత్తితే నడిరోడ్డు మీద కూడా ఆటోలను ఆపేసి ఎక్కించుకుంటుంటారు. దీనివల్ల వెనుకవైపు ఎంతో ట్రాఫిక్ ఆగిపోతుంది. ఇకనుండి నిర్ణీత స్టాపింగ్‌లలో మాత్రమే ఆటోలను నిలిపి ప్రయాణీకులను ఎక్కించుకోవాల్సి వుంటుంది. ఆటో యజమానులు తమ ఆటోలను లైసెన్స్ లేని వారికి ఇచ్చినా, మైనర్లకు ఇచ్చినా యజమానులపై కేసులు నమోదు చేస్తారు. అలాగే నెల్లూరు చుట్టుపక్కల ప్రాంతాలైన ముత్తుకూరు, టి.పి.గూడూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు, కోవూరు, బుచ్చి, నెల్లూరురూరల్ మండలం, వెంకటాచలం, పొదల కూరు మండలాలలోని పలు గ్రామాల నుండి ప్రతిరోజూ వేలసంఖ్యలో ఆటోలు ప్రయాణీకులతో నెల్లూరు నగరంలోకి ప్రవేశిస్తుంటాయి. నగరంలోని ట్రాఫిక్‌పై ఇవి అదనపు భారం. ఈ ప్రాంతాల ఆటోలపై కూడా పోలీసులు ఆంక్షలు విధించారు. ఆయా మండలాల వైపు నుండి వచ్చే ఆటోలను నగర శివార్లలోని ప్రాంతాల వరకే అనుమతిస్తారు. పరిధి దాటి లోపలకు వస్తే చర్యలు తీసుకుంటారు. దీనివల్ల ట్రంకురోడ్డుపై కొంతవరకన్నా ఆటోలు తగ్గుతాయి. ఈ నిబంధ నలను ఖచ్చితంగా అమలు చేస్తే కొంతవరకన్నా నగరంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.

## హజ్‌యాత్ర కెళ్లిన జేసీ

జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఈ నెల 13న హజ్‌యాత్రకు బయలుదేరి వెళ్లారు. హజ్‌యాత్రకు బయ ల్దేరిన జేసీకి పలువురు అధికారులు, ముస్లిం సోదరులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉబ్బేస్తుంది

ఎండ కాయదు... ఉబ్బ తగ్గదు... వర్షం పడదు... ఇదీ జిల్లాలో వాతా వరణం పరిస్థితి. ఎండ తీవ్రత తగ్గినా ఉక్కపోత తగ్గడం లేదు. అలాగని ఉక్క పోతకు తగ్గట్లు వర్షాలు పడుతున్నాయా అంటే అదీ లేదు. ఎండాకాలంలో మాదిరి గానే ఉంటున్న ఉక్కపోతకు జనం అల్లా డుతున్నారు.

## ఫైర్ ఆఫీసర్ బదిలీ

జిల్లా అగ్నిమాపక శాఖాధికారి జ్ఞాన సుందరంను పదోన్నతిపై తిరుపతి ప్రాం తీయ అగ్నిమాపక శాఖాధికారిగా బదిలీ చేశారు. జిల్లాలో రెండేళ్ల నుండి ఆయన పనిచేస్తున్నారు. జిల్లాకు కొత్త అగ్నిమాపక శాఖాధికారిగా ఇంకా ఎవరిని నియ మించలేదు.

## విధుల్లోకి వైద్యుడు

నెల్లూరు పెద్దాసుపత్రిలో సర్జికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషాపై విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేసారు.జులై 26వ తేదీన ఓ రోగి మర ణానికి కారణమయ్యాడంటూ కాలేషాను సస్పెండ్ చేశారు. రోగి మృతికి కాలేషా తప్పేమీ లేకున్నా సస్పెండ్ చేయడం అన్యాయమంటూ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆరోజు నుండి ఆందోళన చేయసాగింది. దీంతో జరిగిన సంఘటనపై మళ్లీ విచా రణ నిర్వహించారు. విచారణ నివేదికను ఆధారంగా చేసుకుని కాలేషాపై నిషేధం ఎత్తివేసారు.

## అపోలో పర్యావరణ ర్యాలీ



నెల్లూరులో అపోలో ఆసుపత్రి, జైన్ హబ్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'గో గ్రీన్ అండ్ స్టే హెల్తీ' అనే ర్యాలీ కార్యక్రమాన్ని నెల్లూరు నగరంలో నిర్వహించారు. ఈ ర్యాలీని అపోలో ఆసుపత్రి నెల్లూరు యూనిట్ హెడ్ నవీన్, జైన్‌హబ్ అధ్యక్షుడు శాంతి లాల్‌జైన్ జెండా వూపి ప్రారంభించారు. ఈ ర్యాలీ విఆర్‌సి సెంటర్ నుంచి అపోలో ఆసుపత్రి వరకు కొనసాగింది. పలువురు సైకిలిస్టులు పాల్గొని మొక్కలు నాటా లని పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి ఫైనాన్స్ మేనేజర్ విజయ్‌కుమార్, పిఆర్‌ఓ వంశీచంద్, విక్రమ్‌జైన్, దీపక్‌జైన్, దయనేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరుకళల పరమేశ్వరికి పుష్పయాగం



సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి ఈ నెల 11వ తేదీ శుక్రవారం రాత్రి పుష్పయాగం వైభవంగా జరిగింది. శ్రావణ మాసం సందర్భంగా ఈ వేడుకను నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు, చందనాలంకారం, విశేషపూజలు, శాంతిహోమం జరిగాయి. సాయంత్రం అమ్మవారిని, ఆలయాన్ని, పుష్పయాగ మండపాన్ని శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వివిధ రకాల సుగంధపుష్పాలతో అమ్మవారిని అర్చించారు. పుష్పాభిషేకాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉభయదాతలుగా సాయికుమార్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. టిడిపి నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్ మెట్టు సురేష్‌బాబు, ఈఓ వేమూరి గోపి, ధర్మకర్తలు పూల సుబ్రహ్మణ్యం, సురేష్, శ్రీహరి ఆచారి, సుధాకర్‌యాదవ్, కృష్ణ సుధ, పట్రంగి వెంకటేశ్వర్లు, ప్రధానార్చకుడు చంద్రశేఖర్‌లు పర్యవేక్షించారు.

## మహనీయుల త్యాగఫలం...

# ఈ స్వతంత్ర గళం



మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు మనం దేశంలో స్వేచ్ఛా వాయువులను పీల్చగలుగుతున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఆకే అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. 15వ తేదీ నెల్లూరు పోలీస్ పరేడ్ మైదానంలో అత్యంత వైభవంగా నిర్వహించిన 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు సమానంగా అందినప్పుడే మనం సాధించుకున్న స్వాతంత్ర్యానికి అర్థముంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, జిల్లాలో చేపట్టిన పనులను వివరించారు.



మంత్రి ప్రసంగానికి ముందు సాయుధ దళాలు ప్రదర్శించిన కవాతు ఆహూతులను ఆకట్టుకుంది. మైదానంలో 17 ప్రభుత్వ శాఖలు తమ శాఖల ద్వారా జరుగుతున్న ప్రగతిని ప్రదర్శిస్తూ స్టాల్స్‌ను ఏర్పాటు చేసాయి. ఈ స్టాల్స్‌ను మంత్రి తిలకించారు. ఇక రెవెన్యూ, డ్వామా, ఇరిగేషన్, వైద్య శాఖ, 108 అంబులెన్స్, డిఆర్‌డిఏ, వ్యవసాయం, అటవీ, సర్వశిక్షా అభియాన్, ఐసిడిఎస్, ఆర్‌డబ్ల్యుఎస్, కార్పొరేషన్, హౌసింగ్, ఎస్సీ కార్పొరేషన్, గిరిజన సంక్షేమం, ఉద్యానవన శాఖల శకటాల ప్రదర్శన ఆసక్తికరంగా సాగింది. ఈ ప్రదర్శనలో డ్వామా, రెవెన్యూ శాఖలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించగా, కార్పొరేషన్, వ్యవసాయ శాఖలకు తృతీయ బహుమతులు లభించాయి. అలాగే వివిధ పాఠశాలల విద్యార్థులు దేశభక్తి గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖలలో ప్రతిభ కనపరచిన ఉద్యోగులకు మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, జిల్లా ఎస్పీ రామకృష్ణ, జిల్లా పరిషత్ ఛైర్మెన్ బి.రాఘవేంద్రరెడ్డి, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జ్ జేసీ వెంకట సుబ్బారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు హాజరయ్యారు.






# పోర్టులో రాష్ట్రపతి తనయుడు

భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కుమారుడు ప్రశాంత్‌కుమార్ ఈ నెల 12వ తేదీన తన సతీమణితో కలిసి కృష్ణపట్నం పోర్టును సందర్శించారు. పోర్టులో బెర్త్‌లను, నౌకల ద్వారా జరుగుతున్న ఎగుమతులు, దిగుమతులను పరిశీలించారు. పోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రీన్ ఇండియా కార్యక్రమం గురించి తెలుసుకున్నారు. కృష్ణపట్నం పోర్టు సెక్యూరిటీ అకాడమీని సందర్శించి గార్డ్స్ గౌరవ వందనం స్వీకరించారు. అలాగే తూర్పుకనుపూరులో సివిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న నవనీతం పబ్లిక్ స్కూల్‌ను సందర్శించారు.

## ఓడరేవును సందర్శించిన మంత్రి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాస్ ఈ నెల 13వ తేదీ ఆదివారం ముత్తుకూరు మండలం కృష్ణపట్నం ఓడరేవును సందర్శించారు. రేవులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. స్థానిక ప్రతినిధులతో వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమవారం ఉదయం పోర్టు నుంచి తిరుమలకు మంత్రి బయలుదేరి వెళ్లారు.

# నెల్లూరులో డిజిపి

ఏపి డిజిపి ఎన్.సాంబశివరావు 15వ తేదీ నెల్లూరొచ్చారు. తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన తిరిగి విజయవాడకు వెళుతూ మధ్యలో నెల్లూరులో ఆగారు. పోలీసు గెస్ట్‌హౌస్‌లో ఇరవై నిముషాల పాటు వుండి తిరిగి విజయవాడకు బయల్దేరారు.

# దైవసేవలో మేటి... వాకాటి



శ్రీవారి సేవకు అంకితమై, నెల్లూరుజిల్లాలో ఎక్కడ శ్రీనివాసుని కళ్యాణోత్సవాలు నిర్వహిస్తున్నా అక్కడ ప్రత్యక్షమై స్వామివారి సేవలో తరించే టిటిడి ధార్మిక మండలి సభ్యుడు, నెల్లూరులో మాడరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి టిటిడి నుండి 'విశేష సేవా పురస్కారాన్ని' అందుకున్నారు. ఈ నెల 15వ తేదీన తిరుపతిలోని టిటిడి పరిపాలనా కార్యాలయంలో జరిగిన 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో టిటిడి ఇ.ఓ అనిల్‌సింఘాల్, జెఇఓ కోలా భాస్కర్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకోవడం జరిగింది. నెల్లూరుజిల్లాలో శ్రీవారి కళ్యాణోత్సవాల నిర్వహణకు, ధార్మిక కార్యక్రమాలకు వాకాటి ఎంతో కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు ప్రశంసించారు.

# అవినీతిపై ఉక్కుపాదం

**- ఏసిబి డైరెక్టర్ జనరల్ ఆర్‌పి ఠాకూర్**

అవినీతిపై ఏసిబి ఉక్కుపాదం మోపుతుందని, అవినీతిపరులను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అవినీతిని అడ్డుకుంటామని ఏసిబి డైరెక్టర్ జనరల్ ఆర్‌పి ఠాకూర్ అన్నారు.

ఈ నెల 12న ఆయన నెల్లూరులోని ఏసిబి కార్యాలయాన్ని తనిఖీ చేసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏసిబి పనితీరు మెరుగ్గా ఉందని, ఎన్నో కీలకమైన కేసులు నమోదు చేస్తున్నారని ఆయన అంటూ, ఈ ఏడాది ఇప్పటికే 19 లంచం కేసులు, 27 అక్రమాస్తుల కేసులు నమోదు చేశారని, పలువురి అక్రమాలను బహిర్గతం చేశారని అన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలంటే అవినీతిరహిత సమాజం ఏర్పడాలని, నీతి న్యాయాలతో పౌరసేవలందించాల్సిన అధికారులు కూడా అవినీతికి పాల్పడుతుండడం దురదృష్టకరమని అన్నారు. అవినీతి అధికారుల వ్యవహారాలను ఏసిబి డేగకన్నుతో పరిశీలిస్తుందన్నారు. అక్రమార్కులను ఎవరినీ వదిలేది లేదన్నారు. అక్రమాస్తులన్నింటినీ న్యాయస్థానం అనుమతితో ప్రభుత్వానికి స్వాధీనం చేస్తామన్నారు. ఏసిబికి రాష్ట్రంలో ఎక్కడా సొంతభవనాలు లేవని, ప్రభుత్వం ఇటీవల వీటి నిర్మాణాలకు ఆదేశాలిచ్చిందని, ఒక్కో భవనానికి 1.5 కోట్ల రూపాయల నిధిని కేటాయించిందని తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఆమేరకు భవన నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ నిధులతో ఏసిబి కార్యాలయాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సోలార్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. నెల్లూరులోని బట్వాడిపాళెం కూడలిలో ఏసిబికి శాశ్వత భవన నిర్మాణం జరుగుతోందని, ఈ ఏడాది ఆఖరుకల్లా నిర్మాణం పూర్తవుతుందని అన్నారు. ఏసిబి అధికారులు, సిబ్బంది వృత్తిలో క్రమశిక్షణగా ఉంటూ, అక్రమార్కులపై దృష్టిపెట్టి ప్రజలకు అవినీతి



రహిత సమాజాన్ని అందించాలన్నారు. ప్రజలు కూడా ఏసిబికి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని అన్నారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ రామకృష్ణతో కలసి ఏసిబి భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. అనంతరం జిల్లాకు సంబంధించిన పలు అంశాలను ఎస్పీతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ టి.గంగాధర్; డిఎస్పీ పరమేశ్వరరెడ్డి, సిఐలు శివకుమార్‌రెడ్డి, శ్రీహరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# కళ్యాణ వైభవం...!



గూడూరు లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ బుస్సారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి - లేట్ కుంతలమ్మ మనుమరాలు, కొండ్రెడ్డి నరేష్‌బాబురెడ్డి - మాధవిల కుమార్తె **సాయిసూర్య - నందికేశ్** (నెల్లూరుజిల్లా, వెంకటాచలం మండలం, అనికేపల్లి గ్రామ వాస్తవ్యులు పంటా రామలింగారెడ్డి - సుప్రియల కుమారుడు)ల వివాహం నెల్లూరు, స్రిడ్స్ ఫంక్షన్‌హాలులో 16వ తేదీన వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



గూడూరు నెల్‌క్యాస్ట్ లిమిటెడ్ డిప్యూటి జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్), నెల్లూరు వాస్తవ్యులు తాడేపల్లి మురళీకృష్ణ - రమాసుందరిల కుమార్తె **రమ్యకృష్ణ - భరతేష్** (నెల్లూరు వాస్తవ్యులు శ్రీరాం రామమోహన్ - దయామతిల కుమారుడు)ల కల్యాణం నెల్లూరు ఎంసిఎస్ కళ్యాణ మండపంలో ఆగస్టు 9వ తేదీ వైభవంగా జరిగింది. నూతన జంటకు 'లాయర్' శుభాశీస్సులు.



గూడూరు స్టేట్ బ్యాంక్ డిప్యూటి మేనేజర్ మగ్గం వెంకటరమణయ్య - ఆనందమ్మల కుమారుడు **లీలాశివప్రసాద్ - కిరణ్మయి** (సర్వేపల్లి గ్రామ వాస్తవ్యులు సూరి త్యాగరాజు - వసుంధరల కుమార్తె)ల పరిణయం గూడూరులోని డాక్టర్ సి.ఆర్.రెడ్డి కళ్యాణ మండపంలో ఈ నెల 12వ తేదీ వైభవంగా జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



స్వాతంత్ర్య సమరయోధుడు పద్మనాభయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీల్, ఆర్డీవో అరుణ్‌బాబు, ఛైర్‌పర్సన్ దేవసేన తదితరులు

## గూడూరు డివిజన్ వార్తలు

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మంగళవారం ఆర్డీవో అరుణ్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎంపిపి రావమ్మ, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, జడ్పీటీసీ సభ్యురాలు పద్మ, ఇతర ప్రజాప్రతినిధులతో కలసి జెండా ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రన్నబీమా పథకం ప్రస్తుతం ఉన్నదానిని రూ.2లక్షలు చెల్లించేలా చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో రూ.250కోట్లతో రోడ్లు, భవనాలు, రూ.98కోట్లతో పిఆర్, రూ.300 కోట్లతో జలవనరులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. పట్టణంలోని అర్హులైన లబ్ధిదారులకు 5,103 ఇళ్ళు, నియోజకవర్గంలో 6వేల ఇళ్ళు మంజూరు చేయడం జరిగిందని, గూడూరు చెరువు ఆధునీకరణకు రూ.14కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు వెల్లడించారు. గూడూరు ఒకటో పట్టణం నుంచి రెండో పట్టణానికి మధ్యలో వున్న ఫ్లైఓవర్ వంతెన అసంపూర్తిగా ఉన్న కారణంగా మరో మూడు నెలల్లో పనులు ప్రారంభించి పూర్తి చేసేలా అధికారులతో చర్చించినట్లు వెల్లడించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు పద్మనాభయ్యను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా గూడూరులోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో గెలుపొందిన పాఠశాలలకు ప్రశంసాపత్రాన్ని, బహుమతులు అందజేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపినవారికి, స్వచ్ఛంధ సంస్థలకు ఎమ్మెల్యే ప్రశంసాపత్రాలు అందించారు.

# నెల్లటూరు పాఠశాలకు డికె ఫౌండేషన్ టీ.వి




మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, తెలుగుదేశం నాయకుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి

గూడూరు మండలం, నెల్లటూరు ఉన్నత పాఠశాలలో డి.కె ఫౌండేషన్ ఆధ్వర్యంలో కె.చంద్రహాస్ దాతృత్వంతో డిజిటల్ టి.వి., విద్యాసామాగ్రిని ఇటీవల అందించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ నాయకుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు రాబోవు రోజుల్లో ఆధునిక పద్ధతుల్లో విద్య ఎంతైనా అవసరమన్నారు. విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాభ్యాసం కొనసాగించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, దాత చంద్రహాస్, మయూరి శ్యాంయాదవ్ తదితరులు మాట్లాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో రమేష్, శ్రీనివాసులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదలకు వైజేపీ ఫలసరుకులు

గూడూరు పట్టణంలోని వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ పట్టణంలోని డిఎన్‌ఆర్ కమ్యూనిటి హాలు వద్ద లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాబురావు ఆధ్వర్యంలో ఎస్‌ఎల్‌ఎన్ బాబు దాతృత్వంలో పేదలకు ఫలసరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గోవిందురాజు, మంజులమ్మ, వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, గురునాథం, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.





ఈ నెల 15వ తేదీ నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న గూడూరు ఆర్టీవో కార్యాలయ ఏవో మహమద్‌మదాని, ఏఎమ్‌డిఐ కరుణాకర్, ఎమ్‌విఐ షేక్ బాబు, కానిస్టేబుల్ మురళీ, సీనియర్ అసిస్టెంట్ కుమార్, రంగారావు.



ప్రశంసాపత్రాలందుకున్న తమ సిబ్బందిని అభినందిస్తున్న గూడూరు ఆర్టీఓ చందర్

# ఆర్టీసీ బస్టాండ్లలో మినీ థియేటర్లు

ఆర్టీసీ బస్టాండ్లలో మినీథియేటర్లు ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 39 ప్రాంతాల్లో ఏర్పాటుకు సిద్ధం కాగా, నెల్లూరు రీజియన్ పరిధిలోని అయిదు ఆర్టీసీ బస్టాండ్లలో థియేటర్లను నెలకొల్పనున్నారు.

నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ మిద్దెపైన, నాయుడుపేట, గూడూరు, పొదలకూరు, రాపూరు బస్టాండ్లలోని ఖాళీ ప్రదేశాల్లో అధునాతన వసతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, 199 సిటింగ్ కెపాసిటీతో థియేటర్లను ఏర్పాటు చేయనున్నారు. 25ఏళ్ల పాటు వీటిని లీజ్‌కు ఇవ్వనున్నారు. టెండర్‌దారుడు రూ.5లక్షల డిపాజిట్‌తో పాటు రూ.11,500 దరఖాస్తు ఫీజును చెల్లించాల్సి వుంది. థియేటర్ల ఏర్పాటుకు సంబంధించి అధికారులు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5గంటలలోగా టెండర్లను దాఖలు చేయాల్సివుంది. 22వ తేదీ మధ్యాహ్నం ఓపెన్ చేయనున్నారు. అత్యధికంగా కోట్ చేసిన వారికి టెండర్లను కేటాయించనున్నారు. టెండర్ దక్కించుకున్నవారు ఏడాదిలోపు థియేటర్ నిర్మాణంతో పాటు అన్ని రకాల అనుమతులు పొందాల్సివుంది. టెండర్‌దారుడికి తొలుత 15ఏళ్లపాటు, మరో పదేళ్ళ పాటు లీజును పొడిగించే అవకాశం వుంది.

## మేషం


అశ్వని, భరణి, కృతిక 1 పాదము

చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. రావలసిన బాకీలు కొంతమేరకు అందుతాయి. చెల్లింపులు సకాలంలో జరుపుతారు. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత, కొత్త వస్తువులు, పరికరాలు కొనడం జరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. ఖర్చులు అధికంగా ఉంటాయి. అయినా ధనానికి ఇబ్బందులుండవు.

## కన్య


ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులకు ప్రజలతో అధికారులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. కొంతవరకు ఋణ సమస్యలు పరిష్కారం కాగలవు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉన్నది. ఇతరులకు సహాయపడతారు. తెలియని విషయాలలో తలదూర్చవద్దు. ఆరోగ్యం బాగుంటుంది. వ్యాపకాలు పెరగడం వల్ల, అనుకున్న పనులు సరిగా చేయలేక టెన్షన్ పడుతుంటారు.

## వృశ్చికం


విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. ఆదాయం తగ్గవచ్చును. శుభకార్య ప్రయత్నాలలో నేర్పరితనంతో వ్యవహరించండి. దూర బంధువులను ప్రముఖ వ్యక్తులను కలుసుకొంటారు. విద్యార్థులకు ఉన్నతమైన అవకాశాలు దొరకగలవు. ఒకటి రెండు అనవసర ఖర్చులు పైనబడగలవు. అనుకున్న పనులు, చేపట్టిన వ్యవహారాలను సక్రమంగా నిర్వహించలేకపోవచ్చు.

## వృషభం


కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఇతరులకు సహాయ పడటం, ఉద్యోగులకు అధికారులతో సానుకూలత ఉంటుంది. పరుషంగా మాట్లాడటం, అనవసర విషయాలలో జోక్యం చేసికొనడం చేయకండి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. కోర్టు కేసులందు అనుకూలత, బిడ్డల విద్యా వివాహ విషయాలపై ప్రయత్నాలు జరుపుతారు. అనుకున్న కార్యక్రమాలు సమర్థవంతంగా పూర్తి చేస్తారు.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 18.8.2017 నుండి
తేది. 24.8.2017 వరకు

ఈ వారం మిధున కర్కాటక సింహ కన్యా రాశులలో చంద్రుడు, మిధునంలో శుక్రుడు, 21తేది నుండి కర్కాటకంలో శుక్రుడు, కర్కాటకంలో కుజరాహువులు, సింహంలో రవి బుధులు, కన్యలో గురువు, వృశ్చికంలో శని, మకరంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము:**

19 తేది శనిత్రయోదశి
25 తేది శుక్రవారం వినాయకచతుర్థి
ముహూర్తములు లేవు.

**శ్రావణమాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | శుక్ర | ఏకాదశి | ఉ॥ గం.8.36వ॥ |
| తేది. 19 | శని | ద్వాదశి | ఉ॥ గం.6.12వ॥ |
| | పిదప | త్రయోదశి | రా॥ గం.4.00వ॥ |
| తేది. 20 | ఆది | చతుర్దశి | రా॥ గం.1.53వ॥ |
| తేది. 21 | సోమ | అమావాస్య | రా॥ గం.12.10వ॥ |

**భాద్రపద మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | మంగళ | పాడ్యమి | రా॥ గం.10.50వ॥ |
| తేది. 23 | బుధ | విదియ | రా॥ గం.9.53వ॥ |
| తేది. 24 | గురు | తదియ | రా॥ గం.9.22వ॥ |

## ధనుస్సు


మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కోర్టు వ్యవహారాలు టెన్షన్ కలిగిస్తాయి. కుటుంబంలో చిన్న చిన్న విభేదాలు కలుగవచ్చును. విద్యార్థులు ఉన్నత విద్య విషయంలో ఆందోళనగా ఉంటారు. శుభకార్య ప్రయత్నాలు, ఉద్యోగ ప్రయత్నాలలో వెనుకబడతారు. తొందరపాటు వ్యవహారాలతో ఇబ్బందులు పడతారు. వృత్తి వ్యాపారాలు ఆశించిన తీరుగా ఉండవు. ఆదాయం తగ్గుతుంది.

## మిధునం


మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యాపారులకు, ఉద్యోగులకు అధికారుల వల్ల చిన్న ఇబ్బందులుండవచ్చును. కొత్త వస్తువులు కొనడం, వాహన రిపేర్లుండగలవు. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది. ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి. వ్యాపార, వృత్తి జీవనం కలిగినవారు కొత్త పథకాలు గూర్చిన ఆలోచనలు, ఆదాయమున స్వల్ప పెరుగుదల ఉంటుంది.

## మకరం


ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు అధికారుల నుండి వత్తిడి ఎక్కువగా ఉంటుంది. విద్యార్థులకు ఉన్నత అవకాశాలు దొరకడం, విలువైన సామాగ్రి కొనడం, అనుకోని దూర ప్రయాణాలుంటాయి. సభలు, సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. ఆరోగ్యం బాగానే ఉంటుంది. పాత కేసులు, కోర్టు వ్యవహారాలలో ఉపశమనం పొందుతారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ప్రయత్నాలు చేస్తారు.

## కర్కాటకం


పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనడం మంచిది. చేపట్టిన పనులు సానుకూలమైనను, ఇతరుల విమర్శలకు గురి కావలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాలను ఇతరుల సలహాలతో నిర్వహించడం మంచిది. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. రావలసిన బాకీలు వాయిదా పడతాయి. ఆరోగ్యం ఫరవాలేదు. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు.

## కుంభం


ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. ఆదాయం సామాన్యం. ముఖ్య వ్యక్తులను కలువలేకపోవచ్చును. కొత్త కాంట్రాక్టులు, కొత్త ఏజన్సీలకు ప్రయత్నాలు చేయండి. జరిగిపోయిన విషయాలు గుర్తు చేసి ఇతరులను బాధపెట్టవద్దు. రావలసిన బాకీలు వసూలు కాగలవు. కుటుంబసభ్యులలో సరైన అవగాహన లేక అభిప్రాయభేదాలు ఏర్పడవచ్చును.

## సింహం


మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కుటుంబ వ్యక్తులకు కొద్దిపాటి అనారోగ్య బాధలుంటాయి. అనుకోని ప్రయాణాలుండటం, షేర్ మార్కెట్ నిరుత్సాహపరచడం జరుగుతుంది. కళా క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. విద్యార్థులకు మంచి అవకాశాలు దొరకగలవు. అధికార వర్గాలకు స్థాన చలనం, పని వత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఆరోగ్యం ఫరవా లేదు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు.

## తుల


చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు పైనబడగలవు. ప్రముఖులను కలవడం, అనుకోని ప్రయాణాలుంటాయి. ఉద్యోగార్థులకు చిరు అవకాశాలు దొరకగలవు. స్థిరాస్తుల వృద్ధికి వ్యాపారవృద్ధికి కొత్త ఆలోచనలు చేస్తారు. ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు, అభివృద్ధి తగ్గుతుంది. అనుకున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు.

## మీనం


పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కొత్త పెట్టుబడులకు ప్రయత్నాలు చేయడం, క్రయ విక్రయాలు నిర్ణయం కావడం జరుగుతుంది. విద్యార్థులకు మంచి అవకాశాలు దొరకడం, అనుకూలమైన శుభవార్తలు వినడం జరుగుతుంది. అనుకున్న పనులు జరుగుతాయి. ఖర్చులు పెరుగుతాయి. ఆశించినంత ఆదాయముండదు. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగ్గ రాబడి ఉండదు. చెల్లింపులు సకాలంలో చెల్లిస్తారు.

# బాబుకు బాలయ్య టెన్షన్

గల్పిక

కేసీఆర్ ఆంధ్రులను బలవంతంగా నెట్టేసిన హైదరాబాద్ నగరం. ఆ నగరంలో టివి 10.5 స్టూడియో! ఆ ఛానల్ ప్రతినిధి మురళీగోపాల్ ఐ.టి మంత్రి లోకేష్‌బాబు ఇంటర్వ్యూ పెట్టుకున్నాడు. ఆ ఇంటర్వ్యూలో భాగంగా... సార్, మిమ్మల్ని అందరూ 'పప్పు' అని అంటుంటారు. ఆ పేరెలా వచ్చింది. ఆ పేరుతో పిలుస్తున్నందుకు మీరేమీ ఫీల్ కారా? అని మురళీగోపాల్ అడిగాడు. అందుకు లోకేష్... ఫీల్ కావడమెందుకు, నేను పప్పు, మా నాన్న నిప్పు... నేను వాడేది బాటా చెప్పు... పాత ఇనుముకు పట్టేది తుప్పు... మమ్మల్ని ఆడిపోసుకునే వాళ్లదే తప్పు... నెక్స్ట్ నువ్వేంటో చెప్పు... అని చెప్పాడు. లోకేష్ ప్రాసల ప్రజ్ఞకు మురళీ గోపాల్ చప్పట్లు తట్టి... సార్, వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా వెళితే ఈ ప్రాసలు ఇక వినలేమేమో అన్న లోటుండేది. వెంకయ్య స్థానాన్ని భర్తీ చేయడానికి మీరొచ్చారు. 'పప్పు' పట్ల మీ అభిప్రాయం అని మళ్ళీ అడిగాడు. అందుకు లోకేష్.. పప్పు... అప్పు లేనిదే మనిషి జీవితం నడవదు. కందిపప్పు... మినపప్పు... పెసరపప్పు... జీడిపప్పు... శెనగపప్పు... బాదంపప్పు... పిస్తాపప్పు... ఆకుకూర పప్పు... తోటకూర పప్పు... ఇలా ప్రతి ఇంటిలోనూ, ప్రతి హోటల్‌లోనూ, ప్రతి అంగట్లోనూ నేనుంటాను. కాబట్టి నాకు ఆ పేరు పెట్టిన వాళ్లకు ధన్యవాదాలు తెలుపుతున్నాని చెప్పాడు. అంతలో లోకేష్ సెల్ మోగింది. అర్జంట్‌గా విజయవాడ సీఎం ఆఫీసుకు రమ్మని పిలుపు. లోకేష్ ఇంటర్వ్యూను ముగించి లేచాడు.

★★★★★

ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం. హైటెక్‌రత్న చంద్రబాబుతో పాటు మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, అచ్చెన్నాయుడు, పత్తిపాటి పుల్లారావు, కె.ఇ.కృష్ణమూర్తి, నంద్యాల ఓఎస్‌డి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు వున్నారు. అందరి ముఖాల్లోనూ టెన్షన్ కనిపిస్తోంది. అప్పుడే బాలకృష్ణ, లోకేష్‌లు అక్కడకు వచ్చారు. దిగులుగావున్న చంద్రబాబును, మంత్రులను చూసి బాలయ్య... ఏం అలా వున్నారని అడిగాడు. దానికి సోమిరెడ్డి... నంద్యాల ఎలక్షన్ మనకు సెమీఫైనల్ లాంటిది. ఓడితే పరువు - ప్రతిష్ఠ జాయింట్‌గా పోతాయి. అక్కడ పరిస్థితి టైట్‌గా వుంది. జగన్ అక్కడే తిష్టవేసాడు, సుడిగాలిలా ప్రచారం చేస్తున్నాడు. జనం బ్రహ్మరథం పడుతున్నారు. అతనికి పోటీగా మనం ప్రచారానికి లెజెండ్‌ను దించాలి. పవన్ కళ్యాణ్‌ను దించుదామా అంటే... గెలిస్తే క్రెడిట్ అంతా అతనికి పోతుంది. మనం డమ్మీల మవుతాం. జగన్‌ను ఎలా ఎదుర్కోవాలా అని ఆలోచిస్తున్నాం అని చెప్పాడు. అప్పుడు లోకేష్... దానికంత టెన్షన్ ఎందుకు డాడీ... నేను, మామయ్య నంద్యాల ప్రచారానికెళ్తాం అని అన్నాడు. వెంటనే బాలయ్య అందుకుని... నంద్యాలలో గెలవాలంటే జగన్‌కు పదిరోజులు కావాలి, నాకు పదిగంటలు చాలు అని అన్నాడు. ఆ మాటకు చంద్రబాబు టక్కున... జగన్‌ను గెలిపించడానికా? అని అనేసాడు. అదేంటి బావా... మన పార్టీ అభ్యర్థిని గెలిపించడానికి నేను పదిగంటలు నంద్యాలలో ప్రచారం చేస్తే చాలు. అంతా తారుమారైపోతుంది అని బాలయ్య చెప్పాడు. అందుకు చంద్రబాబు... నా బాధ కూడా అదే... మిమ్మల్ని ప్రచారానికి పంపిస్తే నా తల రాత తారుమారవుతుందేమోనని భయం. ఎక్కడ నువ్వు ఎవరి మీద చేయిచేసుకుంటావో, ఎక్కడ లోకేష్ తెలుగుదేశాన్ని మతతత్వ పార్టీ అని తిడతాడో అని నా ఆందోళన. అట్లాగని నువ్వు హీరోవి... లెజెండ్‌వి... అభిమానులు వున్నవాడివి... నిన్ను ప్రచారానికి పోకుండా ఆపలేను అని చంద్రబాబు మనసులో బాధను చెప్పుకున్నాడు. అప్పుడు సోమిరెడ్డి... మీరేం వర్రీ కాకండి సార్, బాలయ్యను, లోకేష్‌ను మేం నంద్యాలకు తీసుకెళతాం, బ్రహ్మాండంగా ప్రచారం చేయిస్తాం, మీరు ధైర్యంగా ఉండండి అని భరోసా ఇచ్చాడు. అప్పుడు చంద్రబాబు... అభిమానులను బాలకృష్ణపైన పడకుండా చూడండి, అలాగే లోకేష్‌కు మనది తెలుగుదేశంపార్టీ అని బట్టీ పట్టించి తీసుకెళ్లండి... అని సలహా ఇచ్చి లేచాడు. దాంతో లోకేష్‌ను, బాలయ్యను వెంటబెట్టుకుని సోమిరెడ్డి నంద్యాల బయలుదేరాడు. చంద్రబాబు ఇంట్లోకి వెళ్లి రెండు పుల్కాలు తిని మనసులో బాలకృష్ణ, లోకేష్‌ల గురించి టెన్షన్ పడుతూ నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

చంద్రబాబు చాలా తొందరగా అంటే ఆరుగంటల వ్యవధిలోనే వీడియో కాన్ఫరెన్స్ ముగించి ఇంట్లోకి వెళ్లాడు. నంద్యాలలో విశేషాలేంటో చూద్దామని టీవీ ఆన్ చేసి ఏబిసిడి ఛానెల్ పెట్టాడు. నంద్యాలలోని ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లో బాలయ్య ప్రచారానికెళ్లాడు. అక్కడ వేల సంఖ్యలో అభిమానులు పోగయ్యారు. బాలయ్యతో సెల్ఫీల కోసం యువకులు ఎగబడుతున్నారు. తోసుకుంటున్నారు. ఆ సీన్ చూస్తుంటే చంద్రబాబుకు దడ మొదలైంది. ఎక్కడ అభిమానులను బాలయ్య విసుక్కుంటాడో... ఎక్కడ తోస్తాడో... ఎక్కడ వాళ్లంతా రివర్స్ అవుతారోననే భయం వచ్చింది. కాని, అక్కడ చూస్తే బాలయ్య చిరునవ్వుతో అందరితో సెల్ఫీలు దిగుతున్నాడు. అభిమానులు తన మీద పడుతున్నా... కూల్‌గా వారితో తోసుకోవద్దు, మీ అందరితో నేను ఫోటోలు దిగుతాను అని చెబుతూ కలిసిపోయాడు. వారితో ఎంతో స్నేహంగా మెలగసాగాడు. ఆ సీన్ చూసి చంద్రబాబుకు కన్నీళ్లు వచ్చినంతపనయ్యింది. ఏబిసిడి ఛానెల్ వాళ్లు వెంటనే మార్కెట్‌సెంటర్‌లో మంత్రి లోకేష్‌బాబు ఎన్నికల ప్రచారాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయసాగారు. లోకేష్ ప్రసంగం మొదలుపెట్టాడు. మీకు శిల్పా మోహన్‌రెడ్డి తెలుసా అండి అని జనాన్ని ప్రశ్నించాడు. టీవీలో దానిని చూస్తున్న చంద్రబాబు గుండె కలుక్కుమంది. వీడి దుంపతెగ... శిల్పామోహన్‌రెడ్డి మన పార్టీ అభ్యర్థి అనుకుంటున్నాడేమో... ఆయనను గెలిపించమని అడుగుతాడేమో... అని మనసులో సందేహిస్తుండగా... లోకేష్ మాత్రం... ఈ శిల్పా మోహన్‌రెడ్డి మొన్నటి వరకు మన పార్టీలో ఉన్నోడే... కాని, ఇప్పుడు పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసిపిలోకి వెళ్లాడు. ఇలాంటి వారికి ఓటేస్తారా బ్రదర్... అంటూ ప్రశ్నించాడు. టీవీలో దీనిని విన్న చంద్రబాబు... ఫర్వాలేదు. కరెక్ట్‌గా మాట్లాడి నాకు బి.పి తగ్గించాడనుకున్నాడు. అక్కడ లోకేష్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... అన్నలు, తమ్ముళ్లు... 'ఈ దేశంలో అత్యంత అవినీతి పార్టీ, కుల పిచ్చి, మతపిచ్చి వున్న పార్టీ తెలుగుదేశం' అనగానే చంద్రబాబుకు మైండ్ బ్లాక్ అయ్యింది. కాని అక్కడ మాత్రం లోకేష్ కంటిన్యూ చేస్తూ... తెలుగుదేశం కాదు... కానేకాదు. కులపిచ్చి, మత పిచ్చి వున్న పార్టీ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ... అవునంటారా... కాదంటారా తమ్ముళ్లు అని ఆవేశంగా అన్నాడు. ఆ మాట వినగానే చంద్రబాబుకు పోయిన ప్రాణం తిరిగొచ్చినట్లై... వెరీగుడ్ వెరీగుడ్... కరెక్ట్‌గా మాట్లాడావ్... కరెక్ట్‌గా చెప్పావ్ అని అరవసాగాడు. అలా నిద్రలో నుండి లేచి మంచం మీద కూర్చుని అరవసాగాడు. చంద్రబాబు అరుపులకు పక్కనేవున్న భువనేశ్వరీ దేవి లేచి... ఆయన ముఖాన నీళ్లు చల్లింది. అప్పుడుగాని చంద్రబాబు ఈ లోకంలోకి రాలేదు. అప్పటికిగాని తనకు తెలియలేదు... తనకొచ్చింది కల అని. వచ్చిన కల గురించి చంద్రబాబు భువనేశ్వరీదేవికి చెప్పాడు. అప్పుడామె... వాళ్లను ప్రచారానికి పంపించడమెందుకు, మీరిలా టెన్షన్ పడుతూ పీడకలలు కనడమెందుకు... వాళ్ళు సక్రమంగానే ప్రచారం చేసి వస్తారులే, ఇక పడుకోండి అని గదమాయించింది.

# కల్యాణ వైభవం...!



నెల్లూరు ట్రంకురోడ్డులోని రాజరాజేశ్వరి పేపర్ ఎంపోరియం అధినేత చిట్లూరు వీరవెంకట రాజేశ్వరరావు - రాజ్యలక్ష్మిల కుమారుడు **కృష్ణకుమార్ - రాజేశ్వరి** (నెల్లూరు వాస్తవ్యులు కొలపర్తి శ్రీనివాసులు - రాధల కుమార్తెల వివాహం ఈ నెల 9వ తేదీ నెల్లూరులోని ది నెల్లూరు క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరులో సీనియర్ కమర్షియల్ ఆర్టిస్ట్ సిహెచ్ వెంకటేశ్వర్లు(సి.వి.రావు) - మాధవిల కుమార్తె **శ్రీప్రత్యూష - మహేష్‌కుమార్** (తెనాలి వాస్తవ్యులు మాలకొండయ్య - లక్ష్మిల కుమారుడు)ల కళ్యాణం ఈ నెల 13వ తేదీ నెల్లూరులో శ్రీ రాఘవ కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనలు.

# మహనీయుల త్యాగాలతోనే స్వాతంత్ర్యసిద్ధి

## - కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్



దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయులను ఏనాటికీ మరువకూడదని, వారి త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆగస్టు 15న కావలిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొని, జాతిపిత మహాత్మాగాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం గావించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ కనుమర్లపూడి వెంకటనారాయణ, రూరల్ మండల అధ్యక్షులు జంపాని రాఘవులు, రూరల మండల యువత అధ్యక్షుడు సన్నెబోయిన ప్రసాద్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు ట్రంకురోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.మోహన్‌రాజు, కార్యదర్శి సునీల్‌కుమార్, కోశాధికారి జానీ, ఇతర సభ్యులు

## 'భాష్యం'లో శ్రీకృష్ణాష్టమి సంబరాలు

కావలిలోని గాయత్రి నగర్‌లో వున్న భాష్యం పాఠశాల ఆవరణంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికలు వేషధారణలతో అందరినీ అలరించారు. అనంతరం వేడుకగా ఉట్టి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రిన్సిపల్ సిహెచ్ సుధీర్, జోనల్ ఇన్‌చార్జి వెంకటరెడ్డి, రమణ తదితరులు పాల్గొని విద్యార్థులందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మువ్వన్నెల జెండా రెపరెపలు

## ఘనంగా 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు







71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం నెల్లూరు నగరంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాగుంట లే అవుట్‌లోని వైయస్సార్సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి వందనాలు సమర్పించారు. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు పూర్తవుతున్నా భారతదేశం ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగా వుండడంపై ప్రభుత్వాలు పునరాలోచన చేయాలన్నారు.

మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో కస్తూరిదేవి హైస్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు) జెండా వందనం చేసి మాట్లాడుతూ 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మహిళా ప్రభుత్వ స్కూల్‌లో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎంతోమంది మహనీయుల పోరాట ఫలితంగానే ఇప్పుడు మనందరం ఎంతో ఆనందంగా స్వాతంత్ర్యోత్సవ సంబరాలు జరుపుకుంటున్నామన్నారు. అనంతరం స్కూలు పిల్లలందరికి మిఠాయిలు పంచిపెట్టారు. స్కూలు కరస్పాండెంట్ జె.వి.రెడ్డి, అతిథి హోటల్ అధినేత సురేష్, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

నెల్లూరు విఆర్‌సి మైదానంలో విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాగుంట లే అవుట్‌లోని డా॥ కిషోర్స్ రత్నం ఫ్యూచర్ విజన్ పాఠశాలలో విద్యార్థులు కృష్ణాష్టమి, స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికలు, స్వాతంత్ర్యోద్యమకారుల వేషధారణలతో మన సంస్కృతిని, సర్వమత సామరస్యాన్ని చక్కగా తెలియజేశారు. జాతీయ నాయకుల గొప్పదనాన్ని, దేశ విశిష్టతను గురించి చక్కగా తెలిపిన బాలలను జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు అభినందించారు.

మాగుంట లే అవుట్‌లోని వేదవ్యాస ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ ఏ.పి.బాలాజీ జాతీయ పతాకం ఎగురవేసి వందనం చేసారు. విద్యార్థులు వందేమాతరం గీతం, దేశభక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా పాడుతా తీయగా ప్రోగ్రామ్‌లో పాల్గొన్న 8వ తరగతి విద్యార్థి ద్రిశ్య సాజన్‌ను, శాస్త్రీయ నృత్యంలో ఎన్నో జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించిన 3వ తరగతి విద్యార్థిని పి.యశస్వినిని ఘనంగా సత్కరించారు. డైరెక్టర్ ఏ.పి.వేదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదిత్య కళాశాలలో కళాశాల డైరెక్టర్ ఎం.కృష్ణ జాతీయజెండాను ఆవిష్కరించాడు. కళాశాల కరస్పాండెంట్ ఆచార్య ఆదిత్య, సోంపల్లి ఆనందరావు, లక్ష్మికాంతం, డి.పుల్లయ్య, కె.అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి.సుబ్బారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగఫలంగా లభించిన స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ ఎన్.సుధాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్, మహేష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో పాఠశాలలో 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాలలో స్కూలు కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం జాతీయ జెండాను ఎగురవేశారు. డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ అరుణా స్వయంప్రభ, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బ్యాంకు అధ్యక్షులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఉపాధ్యక్షులు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, బ్యాంకు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. ధనుంజయరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో సహకార శాఖాధికారి బి.సుధాభారతి, బ్యాంకు సిఇఓ వై.సరిత తదితరులు పాల్గొన్నారు.

వేదాయపాళెంలోని మైథిలి స్కూలులో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు, శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. కరస్పాండెంట్ బి.మైథిలి పాల్గొన్నారు.

శ్రీ నేతాజీ పైలట్ స్కూలులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ దేశ నాయకులుగా తమ సందేశాన్ని అందించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ యం.వి.నేతాజీ సుబ్బారెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. వైస్‌ప్రిన్సిపల్ డి.వాణి, హెడ్‌మిస్సెస్ ఎన్.ప్రసన్న, హెడ్‌మాస్టర్ యల్.వి.ఎల్.నరశింహరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లూరు కాంగ్రెస్‌పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో ఇందిరాభవన్‌లో 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు డా॥ పనబాక కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కాంగ్రెస్ నాయకులు సి.వి.శేషారెడ్డి చేవూరు దేవకుమార్‌రెడ్డి, చెంచలబాబుయాదవ్, ఉడతా వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఎపియుడబ్ల్యూజె ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో జర్నలిస్టులు ప్రధానపాత్ర వహించారన్నారు. వారి త్యాగాలను మరువలేనివన్నారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు.

నెల్లూరు రాంజీనగర్‌లో సామాజిక కార్యకర్త వాస్తు రామచంద్ర ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. జాతీయ జెండాను జొన్నలగడ్డ శైలజ, ఓగిరాల అనిరుద్ సంయుక్తంగా ఎగురవేశారు.

అలాగే నెల్లూరులోని తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్, బీజేపీ కార్యాలయాల్లోనూ, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు.



# కనువిందుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని నెల్లూరులోని శ్రీకృష్ణ మందిరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. మూలాపేటలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారికి ఊంజల్‌సేవ, అభిషేకాలు, వాహనసేవ, ఉట్టి మహోత్సవాలను శోభాయమానంగా నిర్వహించారు. కామాటివీధిలోని సంతాన బాలగోపాలకృష్ణ మందిరం తదితర ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేకపూజలు, సేవలు నిర్వహించారు. నవాబుపేటలో శ్రీకృష్ణాష్టమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, సింహపురి యువత ఆర్గనైజర్ డివి కృష్ణయాదవ్ నేతృత్వంలో మూడు రోజుల పాటు ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు జరిగాయి.

అదేవిధంగా, ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి ఆలయంలో గోపూజ, తులసీమాత పూజ, గోపాల పూజలు కనువిందుగా జరిగాయి. పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులతో సామూహిక లక్ష తులసీ పూజ నిర్వహించారు.

బాలాజీనగర్‌లోని పిండిమిల్లు సెంటర్‌లో పదిహేను అడుగుల శ్రీకృష్ణ విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. తొలిరోజు పూజాకార్యక్రమాలను ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు కొట్టే వెంకటేశ్వర్లు, వారి మిత్రబృందంతో పాటు అనేక మంది భక్తులు పాల్గొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఇక్కడ ఉట్టి మహోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. బాలాజీనగర్ శివారులో ఉన్న పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణభగవానునికి పూజలు చేశారు.

నగరంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న శ్రీ మురళీకృష్ణ దేవస్థానంలో, వేదాయపాళెంలోని శ్రీకృష్ణ మందిరం, స్వామి అయ్యప్పఆలయంలోని గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో, భక్తవత్సలనగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలోనూ శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.



## అలరించిన చిన్నారుల వేషధారణలు



నగరంలోని అనేక పాఠశాలల్లోనూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఎంతో సంబరంగా జరిగాయి. డైకస్ రోడ్డులో ఉన్న డా. కిషోర్స్ రత్నం మోడల్ స్కూల్‌లోని విద్యార్థినీ విద్యార్థులంతా కృష్ణాష్టమి వేడుకల్లో ఎంతో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. పాఠశాల ముందు చిన్నికృష్ణుని పాదాల ముద్రలను వేసి, చిన్నికృష్ణుని వేషధారణలతో అందరినీ అలరించారు. అనంతరం విద్యార్థులు ఉట్టి ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, డైరెక్టర్లు కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించడంలో తమ పాఠశాల ఎల్లవేళలా ముందుంటుందన్నారు. ఈ వేడుకల్లో ఆ పాఠశాల ప్రిన్సిపల్స్ విజయ, రామచంద్రయ్య, మేనేజర్ విజయ్‌చంద్రతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అదేవిధంగా, స్థానిక నలంద ఇంగ్లీష్‌మీడియం స్కూల్, నేతాజీస్కూల్, సాయిరాం స్కూల్, సత్యసాయి ఇంగ్లీష్‌మీడియం స్కూల్ తదితర అనేక విద్యాలయాల్లో కూడా విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలసి కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో బాలబాలికలు అందరినీ ఆకట్టుకున్నారు.

# వీడుతున్న సంకెళ్ళు

రాష్ట్రంలో తెలుగుదేశంను, చంద్రబాబు నాయకత్వాన్ని చేవగా ఢీకొంటున్న నాయకుడు జగన్! రాష్ట్రంలో కాంగ్రెస్ పతనమైపోయింది. బీజేపీకి గాని, ఇతర పార్టీలకు గాని అంత చేవలేదు. సొంతంగా ఒక ప్రాంతీయ పార్టీని స్థాపించి నడిపే దమ్ము ధైర్యం కూడా ఈ కాలంలో ఎవరికీ లేదు. చంద్రబాబు కూడా ఎన్టీఆర్ స్థాపించిన పార్టీని లాక్కుని ఒకటికి మూడు సార్లు ముఖ్యమంత్రి అయ్యాడుగాని, సొంతంగా పార్టీని స్థాపించి సీఎం అయ్యే సీన్ లేదు.

రాష్ట్ర రాజకీయాలలో ఇంతవరకు నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశమే బలమైన పార్టీ. ఎన్టీఆర్‌కు సినీ గ్లామర్ వుంది, 300కుపైగా సినిమాలలో నటించాడు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలకు విరక్తి కలిగి వుండింది. కాబట్టి ఎన్టీఆర్ తెలుగుదేశం ప్రభంజనం సృష్టించగలిగింది. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్టీఆర్ తర్వాత ఒక ప్రాంతీయపార్టీని స్థాపించి సినిమా గ్లామర్ లేకున్నా, రాజకీయ అనుభవం లేకున్నా రాష్ట్ర శాసనసభలో 70అసెంబ్లీ సీట్లు గెలుచుకున్నది జగన్ స్థాపించిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీయే! ఎన్టీఆర్ తెలుగుదేశం 275 అసెంబ్లీలున్న ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో బలమైన ప్రాంతీయ పార్టీగా ఆవిర్భవిస్తే, జగన్ వైసిపి రాష్ట్ర విభజన తర్వాత 175 సీట్లు మాత్రమే వున్న ఆంధ్ర ప్రదేశ్‌లో 70సీట్లు తెచ్చుకోగలిగింది. కేవలం ఒక్క శాతం ఓట్ల తేడాతో అధికారానికి దూరమైంది. డబ్బు, గ్లామర్ లేనిదే పార్టీలను నడపడం కష్టమైన ఈ కాలంలో జగన్ స్థాపించిన వైసిపి బలీయ శక్తిగా ఎదగడం తెలుగుదేశం శ్రేణులకు నిద్ర లేకుండా చేసింది. వైసిపిని బలహీన పరచడం వారికి సాధ్యం కావడం లేదు. లక్ష కోట్లు తిన్నాడని జగన్ మీద ఎన్ని ఆరోపణలు చేసినా జనం నమ్మడం లేదు, సరి కదా అతనికి నీరాజనాలు పడుతున్నారు. రాజకీయంగా జగన్ చంద్రబాబుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాడు.

జగన్‌ను రాజకీయంగా అణచడానికి తెలుగుదేశం వద్ద సొంత ఆయుధాలేమీ లేవు. వాళ్లు ఇంతకాలం న్యాయస్థానాలలో జగన్‌పై వున్న కేసులను నమ్ముతూ వచ్చారు. అయితే ఇటీవల కాలంలో జగన్‌పై వున్న కేసులు ఒక్కొక్కటిగా వీగిపోతున్నాయి. ఈ కేసులతో సంబంధం వున్న ఐఏఎస్ అధికారులు శ్రీలక్ష్మి, బి.పి. ఆచార్య, శ్యాంబాబు... ఇలా అందరూ కేసుల నుండి బంధవిముక్తులవుతున్నారు. ఈ కేసుల్లో అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించారని తేలితే జగన్‌ను దోషిగా చూపించలేరు. జగన్ మీద పెట్టిన కేసుల్లో చాలా వరకు క్లియరయ్యాయి. ఇక కొద్ది కేసులు మాత్రమే పెండింగ్‌లో వున్నాయి. వాటిల్లో కూడా జగన్‌కు క్లీన్‌చిట్ లభిస్తే చంద్రబాబు లక్షకోట్ల ప్రచారం ఉత్తదే అవుతుంది. జగన్‌ను వేలెత్తి చూపడానికి దారులు మూసుకుపోతాయి.

జగన్ మీద కేసులన్నవి రాజకీయ కోణంలో పుట్టినవే! అతను కాంగ్రెస్ నుండి బయటకొచ్చి వైసిపిని స్థాపించాకే అప్పుడు యూపిఏ అధినేత్రి సోనియాగాంధీ ప్రేరణతో జగన్‌పై కేసులు పడ్డాయి. పగబట్టి జగన్‌ను జైలుకు పంపించడమే కాకుండా 16నెలలు బెయిల్ రాకుండా చేసారు. ఇంత చేసినా కూడా జగన్ రాజీపడకుండా అటు కాంగ్రెస్‌తో, ఇటు రాష్ట్రంలో టీడీపీతో పోరు మార్గాన్నే ఎంచుకున్నాడు. ప్రతికూల పరిస్థితులను ఎదిరించి మొండిగా నిలబడ్డాడు. వైసిపి కేడర్‌ను ఇంత కాలం కేసుల భయమే వెంటాడుతోంది. జగన్ ఈ కేసుల్లో జైలుకు వెళితే పార్టీకి ప్రత్యామ్నాయ నాయకత్వమే లేదు. ఇప్పుడు ఒక్కొక్కటిగా వీగిపోతున్న కేసులతో వైసిపి కేడర్‌కు ఎనలేని ఉత్సాహం వస్తోంది.

అదే సమయంలో చంద్రబాబును మాత్రం ఓటు – నోటు కేసు నీడలా వెంటాడుతోంది. ఇటీవల కేంద్రంలోని బీజేపీ నాయకత్వం రాష్ట్ర రాజకీయాలపై తమ వ్యూహాలను మార్చుకుంటూ వస్తోంది. రేపటి ఎన్నికల్లో ఎవరితో జతకడతారో చెప్పలేని పరిస్థితి. రాజకీయంగా చంద్రబాబును తొక్కాలని భావిస్తే మాత్రం 'ఓటు–నోటు' కేసుకు ప్రాణప్రతిష్ట జరిగే అవకాశముంది. అదే జరిగితే తెలుగుదేశం పరిస్థితి... బాలకృష్ణ బాషలో చెప్పినట్లుగా దిబ్బిడిదబ్బిడే..!

# నంద్యాల మాటే!

(మొదటి పేజీ తరువాయి)

నాయకుడు వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి. నంద్యాల ఉపఎన్నికను చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. వారంరోజుల పాటు నంద్యాలలోనే ప్రచారం నిర్వహించాడు. నంద్యాల ఉపఎన్నికల ప్రచారంలో వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఉత్సాహంగానే పాల్గొంటున్నారు. అధికారపార్టీకి ఏ మాత్రం తగ్గకుండా ఢీ కొడుతున్నారు. తెలుగుదేశం నాయకులకు ఊపిరాడనీయకుండా చేస్తున్నారు.

నంద్యాలలో ఓటరు నాడి పసిగట్టడం అందరికీ కష్టంగానే వుంది. ప్రజలు కూడా తెలివిగా ఎవరు ప్రచారానికి వస్తే వాళ్లకు జైకొడుతున్నారు. గెలుపుపై ఇరు పార్టీలు కూడా ధీమాగా వున్నాయి. తెలుగుదేశం అధికారాన్ని ఉపయోగించుకుని పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయించింది. ఇక్కడ తెలుగుదేశం ఓడిపోతే ఈ పనులన్నీ ఆగిపోతాయనే ఒక ప్రచారాన్ని ప్రజల్లోకి పంపించారు. మరి ఈ ప్రయోగానికి ప్రజలు ఎంతవరకు లోబడతారో చూడాలి. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత బలంగా వుంది. భూమా కుటుంబం పట్ల సానుభూతి అంతగా లేదు. వైసిపి అభ్యర్థికి కొంతవరకు ప్రజాదరణ వుంది. ఇక జగన్ ఇమేజ్ బాగానే పనిచేస్తోంది. సాధారణ పరిస్థితుల్లో ఈ ఎలక్షన్ జరిగి వుంటే ఢంకా బజాయించి వైసిపియే గెలిచివుండేది. కాని, తెలుగుదేశం ఇక్కడ అధికార బలాన్నంతా ఉపయోగించి ఓటర్లను చాలావరకు ప్రభావితం చేయగలిగింది. కాబట్టే పోరు నువ్వా–నేనా అన్నట్లుగా వుంది.

# శీలపరీక్షకు సిద్ధమైన శ్రీధర్

(మొదటి పేజీ తరువాయి)

ధ్వజమెత్తాడు. తన అనుయాయుడిని విచారిస్తే ఓ ఎమ్మెల్యే పేరు చెప్పాడంటూ వచ్చిన వార్తపై సీరియస్ అయ్యాడు. ఆ ఎమ్మెల్యే ఎవరో ప్రజలకు చెప్పాలంటూ పట్టుపట్టాడు. ఒకవేళ అది తన పేరే అయినా నిరభ్యంతరంగా బయటపెట్టాలని తాను తప్పు చేసుంటే ఉరిశిక్షకైనా సిద్ధమని తన అనుచరగణంతో ఎస్పీ కార్యాలయం ముందు ప్రత్యక్షమైపోయాడు.

అసలు తమ విచారణలో ఏ శాసనసభ్యుడి పేరూ రాలేదని, ఇదంతా ఓ దినపత్రిక అత్యుత్సాహంతో చేసిన తప్పుడు ప్రచారమేనని జిల్లా ఎస్పీ తేల్చిపారేశాడు. ఎవరో వ్రాసిన నిరాధార వార్తతో ప్రజలను తప్పుదోవ పట్టించడం, అనవసర మైన అభూత కల్పనలతో ప్రజాప్రతినిధుల ప్రతిష్ట దిగజార్చటం సమంజసం కాదని బహిరంగంగానే ఖండించాడు.

అరెస్టు చేసింది శ్రీధర్‌రెడ్డి అనుచరుడిని కాబట్టి ఆ ఎమ్మెల్యే శ్రీధరే అయ్యుంటాడేమోనన్న వాళ్ళ నోళ్ళు మూతపడ్డాయి. పత్రికలో వచ్చిన క్షణం నుండీ ఈ విషయమే మాట్లాడుకుంటుండిన మేధావుల బాణి మారింది. "శెభాష్" శ్రీధర్ అంటూ శాసనసభ్యుడిని కీర్తించడం మొదలుపెట్టారు. ప్రజాప్రతినిధులపై నిరాధారమైన ఆరోపణలు రావడం సహజమే. ఆ ఆరోపణలకీ తనకీ సంబంధం లేదంటూ ఓ ప్రకటన పారేసి తమ పని తాము చేసుకుపోవడమూ సహజమే... కానీ శ్రీధర్ అలా చేయలేదు. విషయాన్ని నిగ్గు తేల్చాలంటూ పట్టుపట్టాడు. అటు జిల్లా పోలీసు యంత్రాంగాన్నే కాదు ఇటు మీడియాని సైతం నిలదీశాడు. తనని జీరో చేద్దామని ప్రయత్నించినవారి చేతనే హీరో అనిపించుకున్నాడు.

ప్రజాప్రతినిధులంటే అవినీతికి వారధులు కాదు, రాజకీయ నాయకులంటే అక్రమాలకు సారధులు కాదు. నిజమైన ప్రజాసేవ కోసం, నిజమైన సమాజ ప్రగతి కోసం పాటుపడేవాళ్ళూ వుంటారు. ఒక్కసారైనా శాసనసభ్యుడ్ని కావాలన్నది ఒకప్పటి శ్రీధర్ జీవితాశయం. కంఠంలో ఊపిరి ఉన్నంతవరకూ శాసనసభ్యుడిగానే వుండాలన్నది ఇప్పటి శ్రీధర్ ఆకాంక్ష. మరి అలాంటి లక్ష్యం వున్నవాడు తప్పు చేస్తాడా..? అనవసరమైన రొంపిలో కాలు పెడతాడా? ఏ రాజకీయ నేపథ్యం లేని కుటుంబం, కోట్ల ఆస్తులు కూడబెట్టిన పెద్ద తరం అండ లేకుండా కేవలం స్వశక్తితో, స్వంత ప్రాభవంతో విద్యార్థి నాయకుడి నుండి శాసనసభ్యుడిగా ఎదిగిన శ్రీధర్‌రెడ్డి గురించి రాజకీయ మేధావులు వేసుకుంటున్న ప్రశ్నలివి.

ఒక మంచి సంప్రదాయానికి శ్రీధర్ శ్రీకారం చుట్టాడని చెప్పాలి. ప్రజాప్రతినిధులెవ్వరైనా తమపై వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదు అని రుజువయ్యే వరకు పోరాడాలన్నది ఆయన పిలుపు. రాబోయే తరాలలో ఇదొక మంచి ప్రారంభం, రేపటి రాజకీయ నేతలకు ఇదొక మంచి స్ఫూర్తిదాయక సంఘటన. తన ఆశయాలపైన, తాను నమ్ముకున్న సిద్ధాంతాలపైన, తాను పాటిస్తున్న నైతిక విలువలపైనా నమ్మకంతో శాసనసభ్యుడిగానే తన చివరి శ్వాస తీసుకుంటానన్న శ్రీధర్ కోరిక నెరవేరాలని ఆశిద్దాం!

### నంద్యాల ఎన్నికలో...
# పెట్టుబడిదారులూ నెల్లూరోళ్ళే!





నంద్యాల ఎన్నికల ప్రచారంలో నెల్లూరు జిల్లాకు చెందిన ఇరు పార్టీల నాయకులు హల్‌చల్ చేస్తున్నారు. తామే పోటీ చేసినంత కసిగా పని చేస్తున్నారు. అయితే నంద్యాల ఎన్నికలకు ప్రచారకర్తలే కాదు పెట్టుబడి దారులు కూడా నెల్లూరోళ్ళేనని సమాచారం. నంద్యాల వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి ఆర్థికంగా శక్తిమంతుడు. పార్టీ నుండి ఆర్థిక సహకారం ఆశించకుండా ఆయన ఖర్చుపెట్టుకుపోతున్నాడు. తెలుగుదేశం అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి మాత్రం ఫైనాన్స్ అంతా పార్టీయే చూసుకుంటోంది. ఖర్చు విషయంలో మంత్రి అఖిలప్రియ కూడా చేతులెత్తేసింది. ఆర్థికంగా శిల్పాను మోటుకోవాలంటే భూమా కుటుంబం వల్ల కాదు. ఈ దశలో పార్టీ అధిష్టానమే ఆర్థిక భారం నెత్తినేసుకుంది. నంద్యాల ఖర్చు బాధ్యతను నెల్లూరుజిల్లాకు చెందిన నాయకులకే అప్పగించినట్లు తెలుస్తోంది. తెలుగుదేశం తరఫున ఎన్నికల నిర్వహణ అంటే ఖర్చు వ్యవహారాలన్నీ ప్రధానంగా జిల్లాకు చెందిన మంత్రి పి.నారాయణ చూస్తున్నాడు. నంద్యాల ఎన్నికల్లో ఖర్చుకు కావాల్సిన కరెన్సీ నోట్ల బాధ్యతను కూడా నారాయణకే అప్పగించారని తెలుస్తోంది. అలాగే జిల్లాకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ బొల్లినేని శీనయ్యతో పాటు ఇంతకుముందు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా వ్యవహరించిన శిద్దా రాఘవరావు కూడా ఆర్థిక వనరులు సమకూర్చడంలో బిజీగా వున్నారని సమాచారం. ఇలా నెల్లూరు నాయకులు అటు ఎన్నికల ప్రచారంలోను, ఇటు ఫైనాన్స్ పనుల్లో కూడా తమ ప్రతిభ చూపిస్తున్నారు.

### ఉత్కంఠభరితంగా జరిగిన
# నెల్లూరు క్లబ్ ఎన్నికలు!


మేడా అశోక్ కుమార్‌రెడ్డి


వాయు గుండ్ల నాగరాజు

నెల్లూరులో క్లబ్ అంటే గుర్తొచ్చేది నెల్లూరు క్లబ్. వందేళ్లకు పైబడిన చరిత్ర దీనిది. రాష్ట్ర వ్యాప్తంగా పేరున్న ఎందరో ప్రముఖులు ఈ క్లబ్‌లో సభ్యులుగా ఉండే వాళ్ళు. ఈ క్లబ్‌కు అధ్యక్షు డిగా, కార్యదర్శిగా పని చేయడాన్ని సభ్యులు గర్వకారణంగా భావిస్తారు. ఈ పదవుల కోసం పోటీ పడుతుంటారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే నెల్లూరు క్లబ్ కొత్త కార్యవర్గానికి ఈనెల 15వతేదీన ఎన్నికలు జరిగాయి. మేడా అశోక్‌కుమార్‌రెడ్డి, ఇసనాక సునీల్‌కుమార్‌రెడ్డి ప్యానెళ్ళు ఈ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడ్డాయి. 900మందికి పైగా సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేరోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహించగా మేడా అశోక్‌రెడ్డి ప్యానెల్ ఘనవిజయం సాధించింది. అన్ని పదవులను అశోక్‌రెడ్డి ప్యానెల్ సభ్యులే చేజిక్కించుకున్నారు. అధ్యక్షుడిగా మేడా అశోక్ కుమార్‌రెడ్డి 199 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అలాగే కార్యదర్శిగా వాయు గుండ్ల నాగరాజు 52ఓట్లు మెజార్టీతో గెలిచారు. ఉపాధ్యక్షులుగా మేడా రామ రాఘవరెడ్డి, కోశాధికారిగా వీరేపల్లి అశోక్‌లు విజయం సాధించారు. ఇంకా కమిటీ సభ్యులుగా మేడా అశోక్ ప్యానల్‌కే చెందిన కశిరెడ్డి అమరేంద్రరెడ్డి, జక్కా జనార్ధన్‌రెడ్డి, గూడూరు ప్రసాద్, పాముల రమణయ్య, మూలె రత్నాకర్‌రెడ్డి, దుగ్గిశెట్టి శోభన్‌బాబు, కొండేటి శివప్రసాద్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. దాదాపు 30ఏళ్ల తర్వాత నెల్లూరు క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించడంతో క్లబ్‌లో సందడి నెలకొంది.

# నరరూప రాక్షసుడికి మరణ దండన

గత ఏడాది జనవరిలో వరుస హత్యలకు పాల్పడి జిల్లాలో భయోత్పాతాన్ని సృష్టించిన సైకో కిల్లర్ కుక్కపల్లి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్‌కు నాల్గవ అదనపు జిల్లా జడ్జి మరణశిక్ష విధిస్తూ 17వతేదీ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కొండాపురం మండలానికి చెందిన కుక్కపల్లి వెంకటేశ్వర్లు కావలి పట్టణానికి వలస వచ్చి న్యాడిల్స్ బండిని పెట్టుకున్నాడు. అయితే జల్సాలకు అలవాటు పడ్డ అతను నేరాల వైపు దృష్టి సారించాడు. ఒంటరిగా వున్న మహిళలను టార్గెట్ చేసాడు. కావలిలో ఇంట్లో ఒంటరిగా వున్న ఓ మహిళను తలపై సుత్తితో కొట్టి చంపి ఆమె ఒంటిపై వున్న బంగారు నగలతో ఉడాయించాడు. నెల్లూరు రూరల్ మండలం పెద్దచెరుకూరులో వృద్ధ పూజారి దంపతులను హత్య చేసి పరారయ్యాడు. గతేడాది జూలై 9న నెల్లూరు, చిల్డ్రన్స్ పార్కు ప్రాంతంలో వున్న ఆడిటర్ నాగేశ్వరరావు ఇంట్లోకి కేబుల్ టీవీ టెక్నీషియన్ లాగా వెళ్లాడు. అక్కడ వున్న నాగేశ్వరరావు భార్య ప్రభావతి మీద, వారి బంధువైన మరో అమ్మాయి మీద సుత్తితో దాడి చేసాడు. ప్రభావతి అక్కడికక్కడే చనిపోగా, ఇంకో యువతి స్పృహ కోల్పోయింది. అదే సమయంలో ఇంటికొచ్చిన నాగేశ్వరరావు మీద కూడా వెంకటేశ్వర్లు దాడి చేశాడు. ఈ క్రమంలో చుట్టుపక్కల వాళ్ళు చేరి వెంకటేశ్వర్లును పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తర్వాత గాయపడ్డ యువతి కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ వరుస హత్యలు అప్పట్లో జిల్లాలో సంచలనం కలిగించాయి. ఆడిటర్ నాగేశ్వరరావు ఇంట్లో ఈ సైకో కిల్లర్ పట్టుబడకపోయివుంటే జిల్లాలో ఇంకెన్ని ఘోరాలు జరిగి వుండేవో? మొత్తానికి ఈ సైకో కిల్లర్‌కు ఉరిశిక్ష విధించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అట్టహాసంగా వెంకయ్య ప్రమాణస్వీకారం

దేశ రాజధాని ఢిల్లీలో తెలుగు వెలుగులు కళ్ళు జిగేల్ మనిపించాయి. తెలుగు పంచెకట్టు ఆకట్టుకుంది. తెలుగు భాషకు, తెలుగు యాసకు వెలుగులిచ్చిన తెలుగు తల్లి వరపుత్రుడు, నెల్లూరు ముద్దుబిడ్డ మన ముప్పవరపు వెంకయ్యనాయుడు భారత ఉపరాష్ట్రపతిగా కొలువుదీరారు. ఈ నెల 11వ తేదీన ఉదయం 10.45గంటలకు రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్‌హాల్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, వెంకయ్య నాయుడు చేత ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ వేడుకకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బీజేపీ అగ్రనేత అద్వానీ, బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షాలతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, గవర్నర్‌లు కూడా హాజ రయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం అదేరోజున ఆయన రాజ్యసభ ఛైర్మన్‌గా సభాపతి స్థానంలో కూర్చుని అందరినీ అలరించారు.



1998 నుండి ఇప్పటి వరకు రాజ్య సభలో ముందువరుస సీట్లలో కూర్చుని ప్రతిపక్షంలో వుంటే అధికారపక్షాన్ని, అధికారంలో వుంటే ప్రతిపక్ష పార్టీలను దడదడలాడించిన వెంకయ్యనాయుడును చూసిన సభ్యులు ఇప్పుడు కొత్త కోణంలో సభాపతి స్థానంలో సభను ఎంతో హుందా దాగా నడిపిస్తున్న వెంకయ్యను చూస్తున్నారు. కంగ్రాట్స్ వెంకయ్య నాయుడుజీ!

# మీ వెంటే నేనూ...
## వెంకయ్య ఓఎస్‌డిగా సత్య



దాదాపు పాతికేళ్లుగా ఆయన అడు గుల్లో అడుగులు వేస్తూ... ఆయన తిన్నాడా లేదా చూసుకుంటూ... ఆయన ఆరోగ్యాన్ని తన ఆరోగ్యంగా చూసుకుంటూ... ఆయన పడుకుని నిద్రపోయాడనుకున్నాకే తాను నిద్రకు ఉపక్రమిస్తూ, తెల్లారక ఆయనకంటే ముందే లేచి ఆయన సేవలో తరిస్తూ... ఆయనే దైవంగా, ఆయనే మార్గంగా ఆరా ధిస్తూ... ఆయన ఆరోగ్యమే తన బలంగా, ఆయన ఆనందమే తన సంతోషంగా భావిస్తూ... ఆయనను కంటికి రెప్పలా, వీడని నీడలా అనుసరించాడు. అధికా రంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా, బాధ లలో వున్నా, సంతోషంలో వున్నా అన్నిం టికీ తోడులా వీడని నీడలా నడిచాడు.... అతని పేరే సత్యకుమార్. దాదాపు పాతి కేళ్లుగా భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడి నీడలా కనిపెట్టుకున్న వ్యక్తి. వెంకయ్యనాయుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షు డిగా ఉన్నప్పుడు కడపజిల్లా పొద్దుటూరుకు చెందిన వై.సత్యకుమార్ ఆయన వద్ద కార్యదర్శిగా చేరారు. అక్కడ నుండి తన పని తీరుతో, నమ్మకమైన వ్యక్తిత్వంతో వెంకయ్యకు కుడిభుజమయ్యారు. 1999లో ఎన్డీఏ ప్రభుత్వంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసిన వెంకయ్యకు సత్య అదనపు కార్యదర్శిగా పనిచేసాడు. 2014 నుండి కేంద్ర కేబినెట్‌లో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేస్తున్న వెంకయ్య నాయుడుకు ఓ.ఎస్.డిగా వ్యవహరిస్తు న్నాడు. అయితే ఇంతకాలం వెంకయ్య నాయుడు రాజకీయపరమైన పదవులలో ఉండబట్టి సత్యను తన వ్యక్తిగత కార్య దర్శిగా, ఓఎస్‌డిగా నియమించుకున్నారు. ఉపరాష్ట్రపతి వంటి అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించిన ఆయనకు ఇక సత్య దూరం కావాల్సిందేనా అని అనుమానా లొచ్చాయి. అయితే ఉపరాష్ట్రపతి అయినా కూడా వెంకయ్య తన సత్యను వదల్లేదు. ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేసిన రోజే సత్యకుమార్‌ను తన ఓఎస్‌డిగా నియ మించుకున్నారు. ఉపరాష్ట్రపతి ఓఎస్‌డిగా ఆలిండియా సర్వీసు అధికారులను నియ మిస్తుంటారు. కాని తొలిసారిగా ఆలిం డియా సర్వీసుకు సంబంధం లేని వ్యక్తిని ఉపరాష్ట్రపతి ఓ.ఎస్.డిగా నియమించారు. ఇది 'సత్య'కే కాదు, నమ్మకానికి దక్కిన గౌరవం. వెల్‌డన్ సత్య!

### కాణిపాకం ఆలయానికి...
# స్వర్ణ కలశ శోభ



## శ్రీ వరసిద్ధి వినాయకునికి వేమిరెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు

చిత్తూరుజిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వరసిద్ధి వినాయక స్వామి ఆలయ గోపురాలపై 14స్వర్ణకలశాల ప్రతిష్టాపనకు 15వ తేదీ మంగళవారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా పూజలు జరిగాయి. నెల్లూరుకు చెందిన ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త, విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి-శ్రీమతి ప్రశాంతిరెడ్డి దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. తొలుత, వేమిరెడ్డి దంపతులకు రక్షాబంధనాలు కట్టి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణకలశాలను ఆలయంలో ప్రదక్షిణగా ఊరేగించారు. అనంతరం ఆస్వేటి మండపం ప్రత్యేక యాగశాలలో ఉంచారు. బుధవారం స్వర్ణ కలశ మహా సంప్రోక్షణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



వేదిక వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహవచనం, అనుజ్ఞ మహా సంకల్పం, అంకురార్పణ ఆలయ ప్రాంగణంలోని తూర్పు, పశ్చిమ, విమాన, వీరాంజనేయస్వామివారి ఆలయ శిఖర గోపురాలపై వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వర్ణకలశాలను ప్రతిష్ఠించారు. గురువారం ఉదయం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి ఆగమోక్తంగా కలశాల స్థాపన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధి కారి పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో, ఆలయ అర్చకుల నేతృత్వంలో ఈ కలశ పూజలు ఎంతో వైభవంగా జరిగాయి. అనంతరం, వేమిరెడ్డి ప్రభా కరరెడ్డి దంపతులు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ కార్యక్ర మంలో పాల్గొని శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకుని తరించారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com